తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460



https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

శుక్రవారం

04 సెప్టెంబర్ 2026

సంపుటి 03

సంచిక 326

పేజీలు 8

వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com


# 31 కీలక అజెండాలకు ఏపీ కేబినెట్ ఆమోదం

- రైతులు, మత్స్యకారులు, అమరావతి అభివృద్ధికి కీలక నిర్ణయాలు
- తోతాపురి మామిడి, పొగాకు రైతులకు ఆర్థిక చేయూత
- సాగునీరు, విద్యుత్, పారిశ్రామిక రంగాల ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్



అమరావతి, సెప్టెంబర్ 3, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 31 కీలక అజెండా అంశాలకు ఆమోదం లభించింది. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయం, మత్స్యరంగం, సాగునీరు, విద్యుత్, అమరావతి అభివృద్ధి, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే పలు ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రైతులకు ఆర్థిక చేయూత అందించే అంశంపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. తోతాపురి మామిడి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా రూ.281 కోట్ల నిధులు సమకూర్చే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అలాగే పొగాకు రైతులకు ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో రూ.94 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు నిర్ణయం తీసుకుంది. మత్స్యరంగ అభివృద్ధికి తోడ్పడే రిజర్వాయర్ కేజ్ కల్చర్ పాలసీ-2026 ముసాయిదాకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించిన కీలక నిర్ణయాలు కూడా సమావేశంలో తీసుకున్నారు. శాఖమూరులో స్టేట్ పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గుడ్ గవర్నెన్స్ సంస్థలతో కూడిన 'అమరావతి సంగమం' నిర్మాణానికి రూ.759.79 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేశారు. అమరావతిలో సిమెంట్ కాంక్రీట్ రోడ్ల స్థానంలో బీటీ రోడ్ల నిర్మాణం, అమరావతి రైల్వే కనెక్టివిటీ, ఇన్నర్ రింగ్ రోడ్డు పనుల పురోగతిపై కూడా కేబినెట్ చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాగునీటి రంగంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో వరదల అనంతర పునరుద్ధరణ, సాగునీటి వ్యవస్థల మెరుగుదలకు సంబంధించిన 78 పనులకు రూ.6 కోట్లకు పైగా పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. వెలిగొండ టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ యంత్రం తొలగింపు

➤ మిగతా 2వ పేజిలో..



## మూడు కీలక పదవుల్లో మహిళలకు అవకాశం

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మి నియామకం
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద
- కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా జి. సుధారాణి
- వెనుకబడిన తరగతుల మహిళలకు కీలక బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 03, రాష్ట్రంలోని మూడు కీలక పదవుల్లో మహిళలకు అవకాశం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలిగా గద్వాల విజయలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషించే ఈ పదవికి ఆమెను నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారదను నియమించారు. మహిళల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సాధికారతకు సంబంధించిన అంశాలపై మహిళా కమిషన్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఈ నేపథ్యంలో నేరెళ్ల శారద నియామకం మహిళా వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా జి. సుధారాణిని ప్రభుత్వం నియమించింది. వరంగల్ ప్రాంత అభివృద్ధి, పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అంశాల్లో ఈ సంస్థ కీలక బాధ్యతలు నిర్వహిస్తోంది. ఆమె నియామకంతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మూడు నియామకాల ద్వారా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు ప్రభుత్వం

➤ మిగతా 2వ పేజిలో..



# కొండా సురేఖ బర్తరఫ్

- మంత్రివర్గం నుంచి ఉద్వాసన
- రాజీనామాకు నిరాకరించిన సురేఖ
- బర్తరఫ్ నిర్ణయం తీసుకున్న రేవంత్
- గవర్నర్‌కు సీఎం రేవంత్ రెడ్డి లేఖ
- సీఎం నిర్ణయానికి హైకమాండ్ ఓకే..
- చిన్నారెడ్డి పైనా కాంగ్రెస్ పార్టీ వేటు

హైదరాబాద్,సెప్టెంబర్3 తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఊహించిన పరిణామమే చోటు చేసుకుంది. కొండా సురేఖ రాజీనామాకు నిరాకరించడంతో, ఆమెను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఆమెను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసేందుకు ప్రతిపాదించిన అధికారిక సిఫార్సు లేఖను సీఎంఓ ఇప్పటికే గౌరవ గవర్నర్‌కు పంపించింది. కొంత కాలంగా కొండా సురేఖ వ్యవహారశైలి ప్రభుత్వానికి, పార్టీకి ఇబ్బందికరంగా మారింది. సీఎం రేవంత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరికి సీఎం కుటుంబసభ్యులను టార్గెట్ చేయడం, కొండా సురేఖ కుమార్తె సీఎంపై వ్యక్తిగత విమర్శలు చేయడంతో పరిస్థితి చేయి దాటిపోయింది. పీసీసీ క్రమశిక్షణా కమిటీ పదవుల నుంచి తప్పించాలని సిఫారసు చేయడంతో హైకమాండ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇదే సమయంలో పరిపాలనా పరమైన, నామినేటెడ్ పదవుల్లో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్‌గా ఉన్న డాక్టర్ జి. చిన్నా రెడ్డి నియామకాన్ని రద్దు చేస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్థానంలో గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్, కేకే కుమార్తె గద్వాల్ విజయలక్ష్మిని ప్రణాళికా సంఘం నూతన వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.మహిళా సంబంధిత రంగాలు, అభివృద్ధి సంస్థలకు కూడా నూతన సారథులను ప్రకటిస్తూ ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నూతన ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద నియామకానికి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ నేత శారదకు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా ఆ వర్గానికి పెద్దపీట వేసినట్లయింది. మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సంబంధించి కీలకమైన కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పీఠాన్ని కూడా భర్తీ చేశారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు గుండు సుధారాణిని కుడా ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కొండా సురేఖను తప్పించినందున ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయంలో సుధారాణికి ఈ ప్రాధాన్యత ఇచ్చారు. కేబినెట్ నుంచి కొండా సురేఖ తొలగింపు మరియు నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ రాష్ట్ర రాజకీయంలో సంచలనంగా మారింది. ప్రభుత్వ నిర్ణయంపై కొండా సురేఖ వర్గీయుల ప్రతిస్పందన ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారగా, రేవంత్ రెడ్డి మాత్రం తన నిర్ణయాలతో పాలనపై మరియు పార్టీపై తనకున్న పూర్తి పట్టును స్పష్టం చేశారు. రాజీనామా చేయాలని అధిష్టానం సూచించినా వెనక్కి తగ్గని కొండా సురేఖపై నేరుగా బర్తరఫ్ వేటు వేయడం, అదే సమయంలో

➤ మిగతా 2వ పేజిలో..

## అభిమాని కోరిక తీర్చిన వైయస్ జగన్

- బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువకుడికి ఆత్మీయ పరామర్శ
- ఒక్కసారి కలవాలన్న ఆకాంక్షను నెరవేర్చిన వైఎస్ఆర్‌సీపీ అధినేత



- మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ చొరవతో జరిగిన భేటీ
- ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చిన జగన్

కర్నూలు, సెప్టెంబర్ 3బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తన వీరాభిమాని కోరికను వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. కర్నూలుకు చెందిన విశ్వనాథ్ గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతూ చికిత్స పొందుతున్నాడు. వైయస్ జగన్‌కు వీరాభిమాని అయిన అతడు జీవితంలో ఒక్కసారైనా తన అభిమాన నాయకుడిని కలవాలని, ఆయనతో ఫొటో దిగాలని ఎంతోకాలంగా కోరుకుంటున్నాడు. ఈ విషయం పార్టీ నాయకుల ద్వారా జగన్ దృష్టికి చేరడంతో ఆయన వెంటనే స్పందించారు. కర్నూలు పర్యటనకు వచ్చిన సందర్భంగా విశ్వనాథ్‌ను వైయస్ జగన్‌ను కలిసేలా ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ చొరవ తీసుకుని

➤ మిగతా 2వ పేజిలో..




## పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణకు శ్రీకారం

- అభ్యర్థులకు అధ్యయన సామగ్రి పంపిణీ చేసిన మంత్రి సీతక్క
- యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల సాధనకు ప్రత్యేక శిక్షణ
- విజయం సాధించే వరకు నిరంతరం ప్రయత్నించాలని సూచన

➤ 2వ పేజిలో..

# నన్ను తొలగించడం కుట్రే..

- రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- నన్ను తొలగించకపోతే తప్పుకుంటానన్నారు
- బ్లాక్‌మెయిల్ చేసి నన్ను బర్తరఫ్ చేయించారు
- కాంగ్రెస్‌పార్టీలోనే ఉంటా.. నేను పార్టీ మారను
- నా కుమార్తె వ్యాఖ్యలకు నన్నేలా బాధ్యురాలిని
- రాజీనామా చేయమని నన్నెవరూ అడగలేదు
- బీసీ మహిళా మంత్రిగా అణచివేతకు గురయ్యా
- నిర్ణయంపై రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి
- బర్తరఫ్ పై మీడియా సమావేశంలో కొండా సురేఖ
- అధిష్టానానికి పంపిన లేఖ కొండా సురేఖ రిలీజ్



హైదరాబాద్,సెప్టెంబర్3 మంత్రి పదవి నుంచి తనను తొలగించడంపై కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సురేఖను తొలగించకపోతే తాను తప్పుకొంటానని అధిష్ఠానాన్ని రేవంత్ బెదిరించారని ఆమె వ్యాఖ్యానించారు. లోక్‌భవన్ నుంచి

➤ మిగతా 2వ పేజిలో..

## 31 కీలక అజెండాలకు ఏపీ కేబినెట్ ఆమోదం

పనులకు రూ.11.63 కోట్ల నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపారు. కాలువల నిర్వహణ, సాగునీటి హక్కుల అంశాలపై కూడా మంత్రివర్గం చర్చించింది.

విద్యుత్ రంగానికి సంబంధించి ఏపీ ట్రాన్స్‌కో మధ్యకాలిక రుణాల కోసం రూ.950 కోట్ల ప్రభుత్వ హామీ ఇవ్వాలని నిర్ణయించారు. సీలేరు కాంప్లెక్స్‌లో ఏపీ జెన్‌కోకు ఫైర్ ప్రికాషనరీ ఫీజు మినహాయింపుకు ఆమోదం తెలిపారు. ఓక్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల కేటాయింపును రద్దు చేయడం, విండ్-సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టుల సామర్థ్యాల మార్పిడి అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకున్నారు. విద్యుత్ సంస్థల రుణాలకు సంబంధించి కార్పొరేట్ గ్యారంటీల అంశాన్ని పరిశీలించారు. పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి, వివిధ ప్రభుత్వ సంస్థలకు భూ కేటాయింపులు, మార్కాపురంలో సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం, కడప జిల్లాలో ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై కూడా కేబినెట్ చర్చించి ఆమోదం తెలిపింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా తీసుకున్న ఈ నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

## మూడు కీలక పదవుల్లో మహిళలకు అవకాశం

ప్రాధాన్యత కల్పించింది. కీలక పరిపాలనా, అభివృద్ధి సంస్థల్లో మహిళలకు అవకాశాలు కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనే సంకేతాలను పంపిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజా సేవలో అనుభవం ఉన్న మహిళలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రణాళికా సంఘం, మహిళా కమిషన్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ వంటి కీలక సంస్థల్లో కొత్త నాయకత్వం బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆయా రంగాల్లో కొత్త కార్యక్రమాలు, విధాన నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి, మహిళా సంక్షేమం, పట్టణాభివృద్ధి రంగాల్లో ఈ నియామకాలు కీలక మలుపుగా నిలుస్తాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణకు శ్రీకారం

ములుగు, సెప్టెంబర్ 03, కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ప్రోత్సాహం అందించేందుకు ములుగు ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క శిక్షణ పొందనున్న అభ్యర్థులకు అధ్యయన సామగ్రిని పంపిణీ చేశారు. ఉద్యోగాల కోసం కృషి చేస్తున్న యువతకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించడం ద్వారా వారి లక్ష్య సాధనకు ప్రభుత్వం తోడ్పడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే జిల్లా ఎస్పీతో చర్చించి ఉచిత శిక్షణ ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లలో సహకరించిన జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. టాస్క్ సహకారంతో ఉచిత శిక్షణ అందించేందుకు ముందుకొచ్చిన శిక్షణ సంస్థ నిర్వాహకులను కూడా ప్రశంసించారు. యువత ఉద్యోగ సాధనలో ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా చూడటమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు.

పోలీస్ ఉద్యోగాల ఎంపికలో శారీరక ప్రమాణాలు కీలకమని పేర్కొన్న మంత్రి, అభ్యర్థులు చివరి దశలో నిరాశ చెందకుండా ముందుగానే ప్రాథమిక శారీరక కొలతలను పరిశీలించినట్లు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో అర్హత సాధించిన 250 మంది అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషి చేసి ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు. ములుగు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల యువతకు కూడా ఇలాంటి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా గంగారం, కొత్తగూడ మండలాల యువత కోసం కూడా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లాలోని నియోజకవర్గ పరిధి గ్రామాల యువతకు కూడా ఇదే తరహా శిక్షణ అందించేందుకు సంబంధిత అధికారులతో చర్చించినట్లు వెల్లడించారు. గతంలో ఉద్యోగ మేళాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం వచ్చిన ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విజయం సాధించే వరకు ప్రయత్నం కొనసాగించాలని మంత్రి సీతక్క యువతకు సూచించారు. రాత పరీక్షల్లో గానీ, శారీరక సామర్థ్య పరీక్షల్లో గానీ ఆశించిన ఫలితం రాకపోతే నిరుత్సాహపడకుండా మళ్లీ ప్రయత్నించాలని చెప్పారు. కుటుంబ బాధ్యతలతో పాటు చదువుకు, శారీరక సాధనకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోషకాహారం తీసుకుంటూ క్రమశిక్షణతో సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం కష్టపడి ఉద్యోగం సాధిస్తే భవిష్యత్తులో కుటుంబానికి అండగా నిలవగలరని అభ్యర్థులకు ధైర్యం చెప్పారు. డీఎస్పీ రవీందర్, సీఐలు, పోలీస్ సిబ్బంది, అభ్యర్థులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని శిక్షణ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## అభిమాని కోరిక తీర్చిన వైయస్ జగన్

విశ్వనాథ్‌ను జగన్ వద్దకు తీసుకెళ్లారు. తన అభిమాన నాయకుడిని ప్రత్యక్షంగా చూసిన విశ్వనాథ్ భావోద్వేగానికి గురయ్యాడు. ఎంతోకాలంగా మనసులో పెట్టుకున్న కోరిక నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేశాడు.విశ్వనాథ్ ఆరోగ్య పరిస్థితి గురించి వైయస్ జగన్ ఆరా తీశారు. అతనితో కొంతసేపు ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పారు. వ్యాధితో పోరాడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అధైర్యపడవద్దని, ధైర్యంగా చికిత్స కొనసాగించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌తో కలిసి జగన్ ఫొటో దిగారు. తన అభిమాన నాయకుడితో కలిసి ఫొటో దిగిన క్షణాన్ని విశ్వనాథ్ జీవితంలో మరచిపోలేని అనుభూతిగా అభివర్ణించాడు. కుటుంబ సభ్యులు కూడా జగన్ చూపిన ఆప్యాయతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంఘటన అక్కడున్న వారిని కూడా భావోద్వేగానికి గురిచేసింది.

అనారోగ్యంతో బాధపడుతున్న అభిమానిని ప్రత్యేకంగా కలుసుకుని పరామర్శించడం జగన్ మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తోందని వైఎస్ఆర్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల, అభిమానుల పట్ల ఆయన ఎప్పుడూ సానుభూతితో వ్యవహరిస్తారని అన్నారు. విశ్వనాథ్‌కు ఇచ్చిన ధైర్యం అతనిలో కొత్త ఆశలు నింపిందని అభిప్రాయపడ్డారు. తన జీవితంలో అత్యంత ఆనందకరమైన రోజు ఇదేనని విశ్వనాథ్ పేర్కొన్నాడు. వైయస్ జగన్‌ను కలవాలన్న తన కోరిక నెరవేరడంతో ఎంతో సంతోషంగా ఉందని చెప్పాడు. తన ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ జగన్ అందించిన భరోసా జీవితాంతం గుర్తుండిపోతుందని తెలిపాడు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## నన్ను తొలగించడం కుట్రే..

అధికారిక ప్రకటన ఇంకా వెలువడకముందే.. తన బర్తరఫ్‌ను ఆమె ధ్రువీకరించారు. ఈ సందర్భంగా టీవీ9తో మాట్లాడిన సురేఖ పలు కీలక విషయాలను వెల్లడించారు. తనను తొలగించే ముందు కనీసం ఒక్క మాట కూడా చెప్పలేదని సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ కూడా తీసుకోలేదని, రాజీనామా చేయాలని కూడా ఎవరూ చెప్పలేదన్నారు. అధిష్ఠానం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని చెప్పారు. తనతో మాట్లాడి వివరణ తీసుకుని ఉండాల్సిందని అన్నారు. తనపై వేం నరేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, కొండల్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కుట్ర చేశారని సురేఖ ఆరోపించారు. అయితే తదుపరి కార్యాచరణపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. తాను తప్పు చేశాననే భావన లేదన్నారు. తన కుమార్తె కొండా సుస్మిత మాట్లాడిన మాటలను పొంగులేటి సుధాకర్‌రెడ్డి రాజకీయంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. సుస్మిత స్వతంత్ర వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అని, ఆమె అభిప్రాయాలను తాము ఖండించాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో తాము మాట్లాడించలేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని చాలామంది విమర్శిస్తున్నా.. తన విషయంలోనే ఎందుకు ఇంత తీవ్రంగా స్పందించారో సీఎం ఆత్మపరిశీలన చేసుకోవాలని సురేఖ అన్నారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారిలో తామే ముందున్నామని గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తర్వాత తాను ఎక్కువగా అభిమానించింది రేవంత్‌రెడ్డినేనని చెప్పారు. ప్రస్తుతం పార్టీ మారే ఆలోచన లేదని సురేఖ స్పష్టం చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై తమకు అభిమానం ఉందన్నారు. 2018లో కూడా ఇదే "దుష్టశక్తులు" తనకు టికెట్ రాకుండా అడ్డుకున్నాయని, అందుకే అప్పట్లో బీఆర్ఎస్ వైపు చూడాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని విషయాలను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్లు వెల్లడించారు. ఉరిశిక్ష పడిన ఖైదీని కూడా చివరి కోరిక అడుగుతారన్న కొండా సురేఖ తనను మాత్రం ఏ వివరణ అడగకుండానే తొలగించారని, తనను ఇలా ఏకపక్షంగా తొలగించటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తనను తొలగించడం అధిష్ఠానానికి కూడా ఇష్టం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్టుబట్టి తనని బర్తరఫ్ చేయిస్తున్నారని, 'బర్తరఫ్ చేస్తారా? నన్ను వెళ్లిపోమ్మంటారా' అని అధిష్ఠానాన్ని బ్లాక్‌మెయిల్ చేశారని ఆమె ఆరోపించారు. తన మీద, తన మాజీ ఓఎస్‌డీ మీద కుట్రలు చేస్తున్నారని, దీని వెనక వేం నరేందర్‌రెడ్డి, పొంగులేటి, కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మరికొందరు ఉన్నారన్నారు. అందరూ కలిసి కావాలని కక్షగట్టి నన్ను, సుమంత్ కుటుంబాన్ని వేధించారని విమర్శించారు. సుమంత్‌పై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీపై నేను ఎలాంటి విమర్శలు చేయలేదు. ఒకప్పుడు మల్లు రవి కూడా ఒకప్పుడు కాంగ్రెస్‌ను తిట్టారు. మాజీ సీఎం రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని తిట్టారు. నా కుమార్తె వ్యాఖ్యలకు నాపై చర్యలు తీసుకోవటం బాధాకరం. రూ.50 కోట్లు ఇచ్చి పీసీసీ పదవి తెచ్చుకున్నారని తిట్టినవారికి పదవులు ఇచ్చారు. నన్ను తొలగించినందుకు ఏమీ బాధపడటం లేదు. కారణం చెప్పకుండా తొలగించడమే చాలా బాధాకరం. బీసీ మహిళను ఇలా అవమానకరంగా తొలగించటం బాధాకరం. కారణం చెప్పకుండా తొలగించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. కారణం చెప్పాల్సిన బాధ్యత సీఎం, ఏఐసీసీపై ఉందని అన్నారు. మంత్రిగా తనకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని, తన ప్రమేయం లేకుండానే తన శాఖలో నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. తనకు తెలియకుండా తన ఓఎస్‌డీ సుమంత్‌ను తప్పించారని, అభివృద్ధి విషయంలో తన నియోజకవర్గంపై వివక్ష చూపారని విమర్శించారు. తన శాఖలోని అంశాలపై కడియం శ్రీహరి జోక్యం చేసుకున్నారని, తన శాఖలోని అధికారులతో కడియం సమీక్షలు నిర్వహించారని తెలిపారు.మంత్రులందరూ సంతోషంగా ఉన్నారా? గుండెల మీద చెయ్యి వేసుకుని చెప్పాలని సురేఖ కోరారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సంతోషంగా లేరనే విషయం అందరికీ తెలుసనని తెలిపారు. ఇప్పటికైనా అందరూ బయటికి వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సూచించారు. ప్రజలకు సేవ, అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలో ఉందని, పనుల జరగాలంటే ఎవరివద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారని ఆరోపించారు. ఇస్తామన్న హామీలు నెరవేర్చకపోవటం వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని స్పష్టం చేశారు. తాను తప్పు చేయలేదని, తనకు పశ్చాత్తాపం లేదని కొండా సురేఖ వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. వైఎస్ఆర్ తర్వాత రేవంత్ రెడ్డినే ఎక్కువ అభిమానించానని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు, సీఎం కావాలని తానే ముందు కోరుకున్నానని పేర్కొన్నారు. తనపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని భావిస్తున్నానన్న కొండా సురేఖ తన వల్ల ముగ్గురు బీసీ మహిళలకు పదవులు రావటం సంతోషకరమని తెలిపారు. తన కోసం చిన్నారెడ్డిపై వేటు వేయటం సరికాదని అభిప్రాయపడ్డారు. తన కుమార్తె వ్యాఖ్యలను తాను ఖండించాల్సిన అవసరం లేదన్న సురేఖ తన కుమార్తె వ్యక్తిగత అభిప్రాయాన్ని తప్పుపట్టే అధికారం తనకు లేదని స్పష్టం చేశారు. అధిష్ఠానానికి తాను ఇచ్చిన లేఖను మీడియాకు ఇస్తున్నానని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా ఆలోచించుకోలేదని తెలిపారు. జగ్గారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం నిర్ణయం తీసుకున్నారని ఆమె నిలదీశారు.అధిష్టానం చర్యలకు ముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు వివరణాత్మక లేఖ రాశారు. తాజాగా ఆమె ఆ లేఖను బహిర్గతం చేశారు. 2026 ఆగస్టు 23న రాసిన ఈ లేఖలో తాను బీసీ మహిళా మంత్రిగా రాజకీయ అణచివేతకు గురవుతున్నట్లు వివరించారు. వరంగల్ ఈస్ట్ ఎమ్మెల్యేగా, అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రిగా పనిచేస్తున్న ఆమె తనకు 31 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉందని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం ఉందని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తన అధికారాలు క్రమంగా కుదించబడుతున్నాయని ఆమె ఆరోపించారు. తన శాఖలకు సంబంధించిన కీలక నిర్ణయాలు సీఎంఓ నుంచి నేరుగా జారీ అవుతున్నాయన్నారు. తనను సంప్రదించకుండా తీసుకుంటున్నారని పేర్కొన్నారు. యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు వంటి ముఖ్యమైన అంశాల్లో తనకు సమాచారం కూడా ఇవ్వలేదని, సమ్మక్క-సారలమ్మ ఆలయ అభివృద్ధి నిధులు ఒక్క రోజులోనే రోడ్లు, భవనాల శాఖకు బదిలీ చేశారని వివరించారు. శ్రీ రామనవమి సందర్భంగా ప్రభుత్వ ప్రకటనల్లో తన ఫోటోను తొలగించడం తన గౌరవాన్ని దెబ్బతీసిందని అన్నారు.

మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను తనకు తెలియకుండా తొలగించి, పోలీసులు మంత్రి నివాసానికి వచ్చి అరెస్టు చేయడానికి ప్రయత్నించారని, ఇప్పుడు అతనిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ ఈస్ట్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఆలస్యం అవుతున్నాయని, స్మార్ట్ సిటీ, మోడల్ బస్ స్టాండ్, బొంధి వాగు విస్తరణ వంటి పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించినా తనకు సమాచారం ఇవ్వలేదని, అభ్యంతరం తెలిపినా చర్యలు లేవని ఆరోపించారు. జగ్గా రెడ్డి విషయంలో అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని సీఎం చెప్పి, పరకాలలో రేవూరి ప్రకాశ్ రెడ్డికి భారీ మెజారిటీ ఇవ్వాలని బహిరంగంగా పిలుపునివ్వడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. తన 31 సంవత్సరాల కాంగ్రెస్ సేవను దృష్టిలో ఉంచుకుని న్యాయం జరిగేలా విచారణ జరపాలని ఖర్గేను కోరారు. లేఖతో పాటు సంబంధిత వీడియోలు, ఆధారాలు ఉన్న పెన్ డ్రైవ్‌ను కూడా జత చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీపై తన విశ్వాసం చెరగలేదని స్పష్టం చేశారు. ఈ లేఖ ద్వారా అన్ని పరిణామాలను వివరించినా రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ కు అధిష్టానం తలొగ్గింది అని కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారు. తాను అధిష్టానానికి పంపిన లేఖను రిలీజ్ చేశారు.కాగా కేబినెట్ నుంచి బర్తరఫ్ కావటంతో సురేఖ తదుపరి నిర్ణయం పైన ఉత్కంఠ కొనసాగుతోంది. కొండా సురేఖ ఇప్పుడు ఎమ్మెల్యే పదవికి.. పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్దమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు తన మద్దతు దారులతో మంత్రాంగం కొనసాగిస్తున్నారు.

## కొండా సురేఖ బర్తరఫ్

కీలక నామినేటెడ్ పోస్టులను నింపడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన రాజకీయ, పరిపాలనా ముద్రను బలంగా చాటుకుంది. సురేఖ న్యూదిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి, తనపై తీసుకున్న క్రమశిక్షణా చర్యలను తీవ్రంగా ప్రశ్నించిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై పార్టీ చర్య తీసుకోవాలనుకుంటే, ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే 'షో-కాజ్ నోటీసు' (వివరణ కోరే నోటీసు) జారీ చేయాలని ఆమె వాదించారు. ముఖ్యమంత్రి, ఇతర కాంగ్రెస్ నాయకులపై సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో, సురేఖపై చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ముఖ్యమంత్రికి, కొండా కుటుంబానికి మధ్య ప్రత్యక్ష ఘర్షణగా మారింది.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన దిల్లీ పర్యటన ముగించుకుని ఈ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన శంషాబాద్ విమానాశ్రయం నుండి నల్గొండ క్రాస్ రోడ్స్‌కు చేరుకుని, అక్కడ చంచల్‌గూడ-సంతోష్ నగర్ స్టీల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అక్కడే జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు.

## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## రాఘవ్ చద్దాకు ఈసీ షాక్..!

సర్ లో చద్దా ఓటు గల్లంతు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 3 ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి రాజ్యసభకు ఎన్నికై, ఆ తర్వాత పెద్దల సభలో సామాన్యుల ప్రశ్నలు అడిగి కామన్ మెన్ ఎంపీగా ప్రసంశలు అందుకున్న రాఘవ్ చద్దా .. ఆ తర్వాత యూటర్న్ తీసుకుని బీజేపీలోకి ఫిరాయించారు. అయినా రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అయితే తాజాగా ఆయనకు ఎన్నికల సంఘం అనూహ్యంగా షాకిచ్చింది. దీంతో ఆయన రాజ్యసభ సభ్యత్వం ప్రమాదంలో పడుతోంది. రాఘవ్ చద్దా పంజాబ్ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నికయ్యారు. అంటే ఆయనకు ఇక్కడ ఓటు ఉంది. అయితే తాజాగా ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ లో చద్దా ఓటు గల్లంతైంది. దీంతో పంజాబ్ లో ఓటు లేని కారణంగా ఆయన రాజ్యసభ సభ్యత్వం కోల్పోయే ప్రమాదం ఉందన్న చర్చ మొదలైంది. అయితే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 3 ప్రకారం రాజ్యసభకు ఎన్నిక కావాలనుకునే వ్యక్తి భారతదేశంలోని ఏదో ఒక పార్లమెంటరీ నియోజకవర్గానికి ఓటరు అయి ఉండాలి, అది పంజాబ్ నుంచే అక్కర్లేదు. అంటే ఆయన మరో చోట నుంచి ఓటరు అయితే సరిపోతుంది. చద్దా 2022 రాజ్యసభ ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆయన ఢిల్లీలోని రాజేంద్ర నగర్‌లో ఓటు నమోదు చేసుకున్నారు. అయితే పంజాబ్ నుండి రాజ్యసభ ఎంపీ అయిన తర్వాత, ఆయన తన ఓటును పంజాబ్‌కు మార్చుకుని 2024 లోక్‌సభ ఎన్నికలలో ఎస్ఏఎస్ నగర్/మొహాలీలో ఓటు వేశారు. కానీ ఇప్పుడు అక్కడ ఆయన ఓటు లేదు. అయితే ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో ఆయన పేరు లేదు. కానీ తుది జాబితాలో ఉంటే సరిపోతుంది. లేదా పంజాబ్ లో లేకపోయినా వేరే చోట ఉన్నా సరిపోతుంది. అది ఎక్కడో తేలితే ఇబ్బంది లేదు.

## శంషాబాద్‌లో నకిలీ కరెన్సీ ముఠా అరెస్టు

హైదరాబాద్,సెప్టెంబర్3: హైదరాబాద్ లో నకిలీ కరెన్సీని తయారు చేస్తున్న గ్యాంగ్స్ నిత్యం పెరిగిపోతున్నాయి. పోలీసులు, అధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టినా ఈ ఫేక్ కరెన్సీ ముఠా ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. తాజాగా శంషాబాద్ లో నకిలీ కరెన్సీ తయారు చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సామాజిక మాధ్యమాల్లో ముఖ్యంగా యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్ లో చూసి నకిలీ నోట్లు తయారు చేస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని తాజాగా అరెస్టు చేశారు. వీరిలో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి రూ.2.91 లక్షల విలువ జేసే నకిలీ కరెన్సీ స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ప్రింటర్, స్కానర్, లామినేటర్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కుటుంబం నకిలీ రూ. 500, రూ. 200, రూ. 100 నోట్లు తయారీ చేస్తున్నారని.. ఎక్కువగా రాత్రివేళల్లోనే నకిలీ నోట్లు చెలామణి చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మద్యం దుకాణాలు, పాన్ డబ్బాల వద్ద నకిలీ నోట్లు ఇస్తున్నట్లు తెలుసుకున్నారు. నిందితుల్ని చింతల్ తండా, వడ్డిపట్లకు చెందిన రమావత్ రాము అలియాస్ మహ్మద్ (36), రమావత్ మోతీలాల్ (35), రమావత్ గాంధీ (19) లుగా గుర్తించారు. వీరిలో రాము ఫుడ్ డెలివరీ ఉద్యోగి కాగా మోతీలాల్ ర్యాపిడో డ్రైవర్ గా, గాంధీ ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 04 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మృతుని కుటుంబానికి ఆర్ధిక సహాయం అందజేసిన రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి సెప్టెంబర్ 3 తరంగాలు** వలిగొండ మండల పరిధిలో



అరూర్ గ్రామానికి చెందిన కొప్పుల శంకర్ గౌడ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాని పరమర్శించి రాష్ట్ర నాయకులు వాకిటి అనంతరెడ్డి 5 వేల రూపాయలు,ఉప సర్పంచ్ గొడ్డటి సత్యం 5 వేల రూపాయలు,గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ యాదవ్ 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్ వేముల అనిల్, మత్స్యగిరి గుట్ట ధర్మకర్త దామర అంజయ్య, శివాజీ యూనియన్ అధ్యక్షులు బత్తిని కర్ణ గౌడ్,కాంగ్రెస్ నాయకులు బండారు మైపాల్ రెడ్డి, చిలకమర్రి ఉపేందర్, ఎలిమినేటి పెంటయ్య, కొప్పుల దాసు,ఎర్ర గుట్ట , శ్రీనివాస్,లోతుకుంట లక్ష్మణ్, నల్ల రాములు, బత్తిని కిష్టయ్య,యూత్ అధ్యక్షులు ఎర్ర సాయి గౌడ్,ఉపాధ్యక్షులు పాక మహేష్,సోషల్ మీడియా బుర్ర శ్రీకర్ యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ప్రతిపక్ష హోదాకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 3 తరంగాలు** వలిగొండ మండల




కేంద్రంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కెసిఆర్ తన ప్రతిపక్ష హోదాకి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మండల కాంగ్రెస్ పార్టీ,యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్,పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్ష హోదాను కలిగి ఉండి అసెంబ్లీకి రాకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని అటువంటి వ్యక్తి తన పదవికి రాజీనామా చేయాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు వాకిటి అనంతరెడ్డి, జక్కజంగారెడ్డి,సత్తిరెడ్డి సాయి,వరుణ్,కాసుల వెంకన్న,రవీంద్ర, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు,యువకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గ్రామదేవతలకు బోనాలు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 3 తరంగాలు వలిగొండ** మండల పరిధిలోని అరూరు గ్రామంలో గ్రామదేవతలకు మహిళల బోనాలు తీసుకొని కుల్ల వద్దకు వెళ్లి అమ్మవార్లకు వడ బియ్యం మొక్కులు, చెల్లించి,డప్పు చప్పుళ్లతో శిగాలు ఊపుకుంటూ బోనాల పండుగ జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,నాయకులు, మహిళలు,యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను దఘా చేసిన ప్రభుత్వానికి తగిన బుద్ది చెప్పాలి



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్సి సెప్టెంబర్ 3 తరంగాలు** వలిగొండ మండల కేంద్రంలో గురువారం రైతులను వంచించి దఘా చేసిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర రెడ్డి,మాజీ శాసన సభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి లు అన్నారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు 2వ రోజు మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు అమలు కాని హామీలు ఇచ్చి రైతులను,ప్రజలను మోసం చేశారని, రైతుకు రుణమాఫీ,రైతుబంధు, రైతుబీమా,రైతులు పండించిన దాన్యానికి మద్దతూ ధరతో పాటు బోనస్,ఎరువులు కొనడానికి యాపు దాని వల్ల రైతులు ఎంతో ఇబ్బందులు ఎదురుకుంటున్నారని, మహిళలకు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం,నెలకు 2500, యువతకు నిరుద్యోగ భృతి,ఇది సక్రమశీగా అమలు చేయలేదని అన్నారు. రైతుల, ప్రజలను మోసగించిన ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి,మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి,జిల్లా నాయకులు మొగుళ్ళ శ్రీనివాస్,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు పనుమటి మమతా నరేందర్ రెడ్డి, మాజీ మత్స్యగిరి గుట్ట చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి,ఎంపీటీసీ పలుసం రమేష్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి,మర్రి వెంకటేశం, బొల్లారశీ జాంగీర్,ఎండి అఫ్రోజ్,పబ్బు స్వామి వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ఎంపిటిసి లు, నాయకులు,కార్యకర్తల్ను తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పుగల్ రిజర్వాయర్ నుంచి సాగునీరు విడుదల చేయాలని బి ఆర్ యస్ రైతు గర్జన





**జఫర్‌గఢ్ ప్రతినిధి, సెప్టెంబర్ 3,(తరంగాలు)** మండలంలోని ఉప్పుగల్ గ్రామం లో రైతు గర్జన పల్లెపాటి జయపాల్ రెడ్డి జఫర్గడ్ మండల అధ్యక్షులు, నాయిని నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో రిజర్వాయర్ బండ్ వద్ద బి ఆర్ యస్ ఆధ్వర్యంలో రైతు గర్జన ధర్నా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉప్పుగల్ రిజర్వాయర్ నుంచి రైతుల సాగు అవసరాలకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు, బి ఆర్ యస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య లపై నిరసన వ్యక్తం చేస్తూ పిండప్రదానం కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఉప్పుగల్ రిజర్వాయర్ కాలువ కట్ట వెంట పాదయాత్రగా రైతు సదస్సు ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడ రైతు సమస్యలు, సాగునీటి అవసరాలపై నాయకులు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య , నాగూర్ల వెంకన్న ముఖ్య అతిథులుగా వచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పెంతలా రాజ్ కుమార్,మాజీ రైతు కోఆర్డినేటర్ కడార్ శంకర్ యారా సోమిరెడ్డి, గోలి కవితా రెడ్డి, కె. రాజినీకాంత్, నజీర్, నరేష్ గౌడ్, ఉపసర్పంచ్లు కొత్వాల్ కుమార్,మనోహర్, పినిట్టి విజయ్ కుమార్,బత్తుల రాజన్ బాబు, మరేడుపాక రామాదేవి, నాగపురి పావని, శీలం శ్యామ్, ఎండి జబ్బార్ లతీఫ్, నక్కా ప్రవీణ్ కుమార్ తో పాటు బి ఆర్ యస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఎసిబి వలలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

- పోడు రైతు నుండి రూ 30 వేలు డిమాండ్ చేసిన ఫారెస్ట్ బీట్ అధికారి
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్



**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 3, ( తరంగాలు):** ఆళ్లపల్లి మండలం, రామానుజగూడెం గ్రామం లో మధ్యవర్తి ద్వారా రూ 30 వేలు లంచం తీసుకుం టుఉండగా అటవీ శాఖ బీట్ అధికారి తో సహా ఇద్దర్ని ఏసీబీ డిఎస్పీ వై. రమేష్ రెడ్ హ్యాండె డ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డిఎస్పీ మాట్లాడుతూ,ఫారెస్ట్ బీట్ అధికారి బానోత్ రవికు మార్ , (కాచనపల్లి) ఇంచార్జి రామానుజ గూడెంలో ఓ రైతుకు చెందిన పోడు భూమి నుండి, ట్రెంచ్ కొట్టకుండా ఉండేందుకు రూ 30 వేలు డిమాండ్ చేసి,ఆయన ఏజెంట్ సాదిక్ ఇంటి వద్ద 30 వేలు లంచం తీసుకుంటుఉండగా అదుపులోకి తీసుకున్నామని, ఈ ఏడాది లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ లో ఇది నాలుగో అవినీతి కేసు అని తెలిపారు.

## దోమల నివారణకు చర్యలు

**వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 3,(తరంగాలు):** మండలం లోని బండౌతపురం గ్రామంలో వర్షాకాలంలో దోమల బెడద నివారణకు పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.ప్రధాన నివారణ చర్యలుఫాగింగ్ పిచికారీ దోమల వృద్ధిని అరికట్టడానికి కాలనీలు నాలా ప్రాంతాల్లో దోమల మందు (ఫాగింగ్), స్ప్రేయింగ్ చేస్తున్నారు.ఆయిల్ బాల్స్ డ్రైనేజీలు, మురుగునీటి కాల్వల్లో లార్వా (దోమల గుడ్లు/పిల్లలు) పెరగకుండా ఆయిల్ బాల్స్ నూనె ఉండలు వేస్తున్నారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ దశరదం,ఉపసర్పంచ్ సుకన్య,వార్డుమెంబర్స్, వంశీ, మస్తాన్,అశోక్,అజీమ్,విజయ్, నిర్మల, సుప్రియ, కళ్యాణి, రజిత, గ్రామపంచాయతి సిబ్బంది రాజేందర్, నాగరాజు, కేదారి తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన జఫర్గడ్ మండల ఎస్ జి ఎఫ్ క్రీడలు



**జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 3,(తరంగాలు):** మండలం లోని కూనూరు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోబుధవారం రోజున ప్రారంభమై జఫర్గడ్ మండల స్థాయి స్కూల్ గేమ్స్ గురువారం రోజున ముగిసినట్లు ఎస్ జి ఎఫ్ సెక్రటరీ ఆకుల సాయికుమార్ తెలిపారు.ముఖ్యఅతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ పర్వాజ్ హాజరై ఎస్ జి ఎఫ్ క్రీడా పతాకాన్ని అవనతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జఫర్గడ్ మండలం పక్షాన జనగామ జిల్లాలో ఆడి ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లా రాష్ట్ర,జాతీయస్థాయిలో ఎంపిక కావాలని క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. గెలుపు ఓటములు సహజమని ప్రస్తుతం ఎంపిక కాని వారు వచ్చే పోటీల్లో బాగా ఆడి ఎంపికై ముందుకెళ్లాలని హితువు పలికారు.నేడు బాలుర విభాగంలో 14 ఉ 17 సంవత్సరాల వారు సెలక్షన్స్ లో పాల్గొన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల నుండి 160 మందికి పైగా బాలురు పాల్గొన్నారు. కబడ్డీ,కోకో,వాలీబాల్ క్రీడలందు ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ సాయికుమార్ తెలిపారు.ఎంపికైన బాల బాలికలు ఈనెల 10,11 తేదీలలో జనగామ జిల్లా సెలక్షన్స్ కు వెళ్లాల్సి ఉంటుంది. వివిధ క్రీడాంశాలలో సీనియర్ జూనియర్ బాలబాలికల జట్లు మరియు అథ్లెటిక్స్ విభాగంలో మరికొంతమంది మొత్తంగా జఫర్గడ్ మండలం నుండి 150 మంది క్రీడాకారులకు పైగా ఎంపిక చేసినాము. వీరు మండలానికి ప్రాతినిధ్యం వహిస్తూ జనగామ జిల్లాలో పోటీ పడాల్సి ఉంది.ఇట్టి కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రామమూర్తి, రమేష్ బాబు, సోషల్ వర్కర్ పల్లె రాజిరెడ్డి, వ్యాయామ విద్య రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డాక్టర్ వంశీకృష్ణ, హరిత,శ్రీధర్ మహాలక్ష్మి శ్రీలత రాజు శ్రీనాథ్ గోపు నరేష్, వాలీబాల్ కోచ్ చందా సాంబరాజు క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు.



## ఊకే శిరీష మృతికి కారకులైన దుర్మార్గుడిని ఎన్కౌంటర్ చేయాలి

- ఊకే శిరీష ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న ఆదివాసి సంఘాల నాయకులు.



**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 3, ( తరంగాలు):** ఇల్లందు పట్టణ, బాలాజీ నగర్ పంచాయతీలో సాయంత్రం 6:00 గంటలకు ఓకే శిరీష ఆత్మకు శాంతి చేకూ రాలని కోరుతూ కొవ్వొత్తుల ర్యాలీ ఆదివాసి సంఘాల నేతల ఆధ్వర్యంలో నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు పెండకట్ల యాకయ్య, గ్రామ పెద్దలు దొర, పటేళ్లు మాట్లాడుతూ, ఆదివా సి కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదువుకొని జీవనోపాధి కోసం నర్స్ వృత్తిని చేపట్టిన ఆదివాసి బిడ్డ ఊకే శిరీషను అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితున్ని ఎన్కౌంటర్ చేయాలని ఆదివాసి సమాజం తరపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్భయ చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ ఇలాంటి దారుణాలు పునరావృతం అవుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.. నిందితుడిని ఎన్కౌంటర్ చేయాలని ... ఆదివాసీ ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, గ్రామాలలోని మహిళలు, యువత, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపించాలి

- కమర్తపు మురళి గ్లోబల్ ప్రచారం మానుకోవాలి
- మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఖమ్మం నగరం 36వ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నాయకులు కమర్తపు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఇప్పటికైనా త్రీ టౌన్ పై అతను చేస్తున్న గ్లోబల్ ప్రచారం గత కొద్దిరోజులుగా కమర్థపు మురళి పొట్టి శ్రీరామ రోడ్డు, డివిజన్ అభివృద్ధిపై చేసిన వ్యాఖ్యలకు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ స్పందించారు. తమ డివిజన్ పరిధిలో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతుల పరిస్థితి అధ్వానంగా ఉందని ఆరోపించారు. పొట్టి శ్రీరామ రోడ్డు విస్తరణ కోసం కమిషనర్ను కలిసి స్థానికులను ఒప్పించింది నేను శివాలయం దగ్గర నుండి హర్కార బావి దాదాపుగా 180 ఇల్లు అందరితో మాట్లాడి దాదాపుగా 78 డాక్యుమెంట్లు కమిషనర్ కి అందజేయడం జరిగింది.తరువాత అధికారులు వచ్చి రోడ్డు విస్తరణకు కొలతలు వేశారని తెలిపారు ఆ తర్వాత వారి స్వార్థం కోసం అక్కడ ఉన్న అధికార పార్టీ నాయకుడు రెండుసార్లు వాళ్లతో మీటింగ్ పెట్టి వారిని పక్కదోవ పట్టించి వారి వెనక ఉండి ఇంటికి ఐదు వేల రూపాయలు తీసుకొని కాలువలు ధ్వంసం చేశారు . కార్పొరేషన్ కాలవల్ని ఎలా ఎలా ప్రైవేట్ వ్యక్తులు ధ్వంసం చేస్తారని, ఆరోజు పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వడం కూడా జరిగింది.మా డివిజన్లోని అన్ని ప్రాంతాల్లో ప్రాంతంలోని కాలువలు మున్సిపాలిటీకి సంబంధించినవేనని, ప్రైవేటు వ్యక్తులు వాటిని ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలని కోరారు.స్మార్ట్ డ్రైనేజీ పేరుతో ఏడాది క్రితం శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటి వరకు పనులు ముందుకు సాగలేదన్నారు. 2025 ఆగస్టు 14న మంత్రి శంకుస్థాపన చేసిన కాలువ పనులు కూడా పూర్తికాలేదని, రైల్వే శాఖ నుంచి రూ.2 కోట్ల నిధులు వచ్చినా ఫలితం కనిపించడం లేదని విమర్శించారు.బ్రహ్మంగారి గుడి సమీపంలోని రోడ్డు పరిస్థితి, ఆంధ్రా బ్యాంకు నుంచి వైన్ షాపు వరకు రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాల లేమిపై ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాల కోసం పలుమార్లు కోరినా స్పందన లేదని, 60 స్తంభాల ఏర్పాటుకు కమిషనర్కు లేఖ ఇచ్చినా ఎస్టిమేట్ దశలోనే పనులు నిలిచిపోయాయని తెలిపారు.వరద సాయం అందలేదని ఆరోపణ ఎస్పార్క్, పీసీకే తోట ప్రాంతాల్లో మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసిస్తున్నాయని, వరద సాయం కోసం 168 మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్క చెక్కు కూడా రాలేదని రామ్మోహన్ ఆరోపించారు.

గతంలో మంత్రి అజయ్కుమార్ హయాంలో గాంధీచౌక్ నుంచి ఎంఆర్వో కార్యాలయం మీదుగా నయాబజార్ వరకు యూడీఎఫ్ నిధులతో రోడ్డు అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. అలాగే మా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో 23 లక్షల లీటర్ల సామర్థ్యం ఖమ్మం లో బాహుబలీ వాటర్ ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. పిల్లి చిన్నట్టు తోట, పీసీకే తోట ప్రాంతాల్లో రూ.90 లక్షలతో రోడ్లు, కాలువల పనులకు అనుమతులు తీసుకొచ్చినట్లు తెలిపారు.వ్యక్తిగత విమర్శలు సరికాదు మురళి వ్యాఖ్యలపై స్పందిస్తూ ముందుగా డివిజన్ పరిస్థితి, గతంలో జరిగిన అభివృద్ధి గురించి తెలుసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రి పక్కన ఉండి రెండుసార్లు పట్టణ అధ్యక్షుడిగా పనిచేసిన వారు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడటం సరికాదన్నారు. పార్టీ పరంగా ఎవరికి ఏ అభిప్రాయం ఉన్నా, అయితే వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన విధంగా స్పందిస్తానని హెచ్చరించారు.గాంధీచౌక్ ఖమ్మం నగరానికి గుండెకాయ వంటిదని,అలాంటి ప్రధాన ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలు ఉండటం బాధాకరమన్నారు. తమ ప్రాంత ప్రజలు చీకట్లో జీవిస్తున్నారని, కనీసం వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా అభివృద్ధి జరిగిందని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు.మైనారిటీ సోదరులు తమ స్థలాలకు సంబంధించిన సమస్యలు ఉన్నాయని చెప్పినప్పుడు వారిని కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక దాబాల బజార్ రోడ్డులోని వాసవి గార్డెన్ నుంచి ముందున్న ప్రాంతం వరకు సరైన రోడ్డు, తారు, వీధి దీపాలు లేవని తెలిపారు.ఇందిరమ్మ చీరల పంపిణీపై ఫిర్యాదు ఇతర డివిజన్లలో ఇందిరమ్మ చీరల పంపిణీ జరుగుతున్నప్పటికీ తమ డివిజన్లో నిలిపివేయడంతో గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్కు ఫిర్యాదు చేశానన్నారు.జూబ్లీ క్లబ్లో చీరలను నిల్వ ఉంచిన విషయం ఫొటోలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే యూనిట్ ప్రారంభించి పంపిణీ చేయాలని ఆదేశించినట్లు మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ తెలిపారు.

## ఇంటిని కూల్చి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- విలేకరుల సమావేశంలో బాధితులు పోతనబోయిన నాగరాజు



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : రఘునాథపాలెం మండలం ఎంపీడీవో కార్యాలయం పక్కన తమకు చెందిన 1500 గజాల ఇంటి స్థలం ఉంది. సర్వేనెంబర్ 20/ఆ/20/ఇ/20/ఈ లో ఇంటి నెంబర్ 7-173 లో ఇల్లు ఉంది. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని,అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోతనబోయిన నాగరాజు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ.. 2006 నుండి 2026 వరకు నలుగురు వ్యక్తులు వరుస క్రమంలో విక్రయాలు జరిపారని, వాటి లింకు డాక్యుమెంట్లతో పాటు అన్ని అర్హతలు గల డాక్యుమెంట్తో గత సంవత్సరం 2025లో అట్టి స్థలాన్ని తాము కనుగోలు చేశామని, ఈ స్థలంతో ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు ముద్రబోయిన వెంకటేష్, చిక్కుల రామయ్య, బానోత్ ప్రవీణ్ అలియాస్ బాలు అనే వ్యక్తులు సెప్టెంబర్ 1, 2026న అర్ధరాత్రి జెసిపి సహాయంతో ఇంటిని కూల్చి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి చంపుతామని బెదిరించారని ఆరోపించారు. జరిగిన ఘటనపై రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశామని, కేసు నమోదు అయినా కూడా వారి ఆగడాలు ఆగడంలేదని నిత్యం బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇట్టి విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను వేడుకుంటున్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఈగ పూర్ణ, కేతు మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై సంబురాలు





**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ 1000 రోజుల పాలనపై బి ఆర్ ఎస్ పార్టీ నిర్వహిస్తున్న అసత్య ప్రచారాలను తిప్పి కొట్టాలని, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి నాయకులు ప్రజలకు మన కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజా ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించాలని,అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా 1000 రోజుల అద్భుతపాలనపై ప్రచారం చేయాలని తీర్మానం ప్రవేశ పెట్టగా సభ్యులు అందరూ ఏక గ్రీవంగా తీర్మానించారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి లు మాట్లాడుతూ పది సంవత్సరాల దుర్మార్గ పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించారని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర మంత్రివర్గ సభ్యులు ప్రజాపాలన గావిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చేశారని, ఈనాడు బీ ఆర్ ఎస్ ఎస్ నాయకులు 1000 రోజుల పాలనపై నిరసనలు వ్యక్తం చేయటం అతి పెద్ద విచిత్రంగా ఉందని, అదే విధంగా పదేళ్లు పాలన గావించి ఈనాడు ప్రతిపక్ష నేతగా మాత్రం ప్రభుత్వం తరపున అన్ని రకాల సౌకర్యాలు అనుభవిస్తూ 1000 రోజుల్లో జీత భత్యాలు అక్షరాల ఒక కోటి ఇరవై నాలుగు లక్షల నలభై వేల రూపాయలు తీసుకున్నారని,తనకు 57 మంది సిబ్బందిని ఇచ్చారని వీటన్నిటికి కలిపి 1000 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయం అక్షరాల 21 కోట్ల రూపాయలని, ఈ సౌకర్యాలు అనుభవిస్తూ ఇప్పటికీ వరకు ప్రజల పక్షాన ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ లో పెదవి విప్పింది లేదని ఎద్దేవా చేశారు.1000 రోజులుగా ప్రజా ధనాన్ని అనుభవిస్తూ ప్రజల కోసం పని చేయని ప్రతిపక్షనేత తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ, అర్బన్ జిల్లా కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరియు మంత్రివర్గ సహచరుల ఆధ్వర్యంలో ప్రజాపాలన 1000 రోజులు పూర్తయిన సందర్భంగా శ్రేణులతో కలిసి సంబురాలు నిర్వహించనైనది.ముందుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అర్బన్ జిల్లా కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మరియు శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాద్యక్షులు వద్దెబోయిన నరసింహారావు,రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్, జిల్లా సేవాదళ్ అద్యక్షులు సయ్యద్ గౌస్,అనుబంధ సంఘ అధ్యక్షులు బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవ కుమార్, జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ,జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్టాభి,తూములూరి లక్ష్మీ నరసింహారావు కిలారు అనిల్ కుమార్,పుచ్చకాయల సోమిరెడ్డి, కాపా సుధాకర్,ప్రభావతి రెడ్డి, రామ సహాయం హరిత రెడ్డి, దామా స్వరూప, మూడుముంతల గంగరాజు యాదవ్, రంగా జనార్ధన్,కిలారు వెంకట రమణ,బచ్చలకూర నాగరాజు,జెర్రిపోతుల అంజనీ కుమార్,కల్వకుంట్ల గోపాల్,బాణాల లక్ష్మణ్, ఏలూరి శ్రీనివాస్, పమ్మీ అశోక్,మస్తాన్, బెజ్జం గంగాధర్,ప్రతిభా రెడ్డి,మద్దినేని రమేష్,బమ్మిడి శ్రీనివాస్ యాదవ్ శేషగిరి తదితరణాయకులు పాల్గొన్నారు.

## దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేసిన వన్ టౌన్ పోలీస్

**నల్గొండ-- సెప్టెంబర్ 3, తరంగాలు :**

నల్గొండ పట్టణంలో ఆవారాగా తిరుగుతూ చెడు వ్యాసనాలకి అలవాలు పడి, జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను నల్గొండ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.నదీమ్ వయస్సు 25 సంవత్సరములు. షేక్ రిజ్వాన్ వయస్సు 26 సంవత్సరములు.మహమ్మద్ అబ్దుల్ సమీర్ , వయస్సు 23 సంవత్సరములు.ముగ్గురు గతం లో నేరాలు చేసి, జైలుకు వెళ్లిన చరిత్ర ఉంది.

నిందితుల నుండి రికవరు చేసిన 30 తులాల వెండి ఆభరణాలు,4 గ్యాస్ సిలిండర్లు,3 బ్యాటరీలు, 4 సెల్ ఫోన్లు,14,500 నగదునల్గొండ పట్టణం లో ఓల్డ్ సిటీ ఏరియా లో ని వివిద కాలనిలకి చెందిన నిందితులు విలాసవంతమైన జీవితానికి అలవాటుపడి, ముఠా గా ఏర్పడి, నల్గొండ పట్టణంలోని పలు ప్రాంతాలలో తాళం వేసిన ఇళ్ళని లక్ష్యంగా చేసుకుని , నల్గొండ పాతబస్తీ ఏరియాలో ఇళ్ల తాళాలు పగలగొట్టి గత రెండు నెలలుగా దొంగతనాలకు పాల్పడుతున్నారు, మాకు అందిన సమాచారం మేరకు వన్ టౌన్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా, మొత్తం 05 దొంగతనం నేరాలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు పంపారు.నల్గొండ డీఎస్పీ శ్రీ కె శివరాం రెడ్డి ఆదేశానుసారం, చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న వన్ టౌన్ సీఐ




రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదులు, వెంకట్ నారాయణలతో పాటు సిబ్బంది రబ్బానీ, సాగర్ల శంకర్, అంజద్,కిరణ్, అంజయ్యలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీస్ అభినందించారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 04 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్ రైతుకు భరోసా

- మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్
- చంద్రు తండాలో ఎన్ ఎం ఎం ఎఫ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు.. ద్రవ జీవామృతం తయారీపై ప్రత్యక్ష ప్రదర్శన



**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 3, తరంగాలు:**ప్రకృతి వ్యవసాయంతోనే భవిష్యత్ లో రైతుకు భరోసా అని వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ అన్నారు.రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. నల్లబెల్లి క్లస్టర్ పరిధిలోని చంద్రు తండా గ్రామ పంచాయతీలో గురువారం నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. విజయ్ కుమార్, ఎన్ ఎఫ్ ఎస్ ఎం కన్సల్టెంట్ సారంగం, వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్. శిరీష, చంద్రు తండా, రాందాన్ తండా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా రసాయనిక ఎరువులు, పురుగుమందులపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చన్నారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల నిర్వహణ చేపట్టేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని తెలిపారు.

### ద్రవ జీవామృతం తయారీపై డెమో

సదస్సులో ద్రవ జీవామృతం తయారీపై అధికారులు రైతులకు ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. 10 కిలోల తాజా ఆవు పేడను 180 లీటర్ల నీటిలో కలిపి, అందులో 8--10 లీటర్ల ఆవు మూత్రం, 1.5--2 కిలోల బెల్లం, 1.5--2 కిలోల శనగపిండి లేదా పప్పిండి, ఒక పిడికెడు చెట్టు కింద మట్టిని కలిపి కిణ్వ ప్రక్రియకు సిద్ధం చేసే విధానాన్ని వివరించారు.

మిశ్రమాన్ని నీడ ఉన్న ప్రదేశంలో 2--3 రోజుల పాటు ఉంచి, ప్రతిరోజూ ఒకసారి కర్రతో బాగా కలియబెట్టిన అనంతరం పంటలకు వినియోగించవచ్చని తెలిపారు. సిద్ధమైన ద్రవ జీవామృతాన్ని ఎకరానికి సుమారు 200 లీటర్ల చొప్పున నీటిపారుదల ద్వారా అందించవచ్చని, పంట పరిస్థితి, నీటి లభ్యతను బట్టి నెలకు 1--2 సార్లు వినియోగించవచ్చని సూచించారు.

అదేవిధంగా ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే అగ్ని అస్త్రం, జీవామృతం వంటి సహజ పద్ధతుల ప్రాముఖ్యత, వాటి వినియోగ విధానాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

### పంటలను పరిశీలించిన అధికారులు

సదస్సు అనంతరం అధికారులు వివిధ రైతుల పంట పొలాలను సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పంటల నిర్వహణ, చీడపీడల నివారణ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీల రవి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

# మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలి

- క్యాన్సర్ హెల్త్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు



**ఐనవోలు, సెప్టెంబర్ 3,తరంగాలు** : మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం ఐనవోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో సింధు హాస్పిటల్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్య సిబ్బంది ఎమ్మెల్యేకు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... క్యాన్సర్ ను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఉంటుందన్నారు. కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమై చాలా మంది మహిళలు తమ ఆరోగ్యపై నిర్లక్ష్యం చేస్తున్నారని వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కష్టతరమై ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపారు. స్క్రీనింగ్ లో అనుమానిత కేసులను గుర్తించి వారికి పరీక్షలు చికిత్స అందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అవసరమైన వారికి ప్రభుత్వ పథకాలు ఉచిత లేదా తక్కువ ఖర్చులతో లభించే వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వైద్యులను సూచించారు.ఇలాంటి మరిన్ని క్యాన్సర్ హెల్త్ క్యాంపులు అన్ని మండలాల్లో నిర్వహించాలని సింధు హాస్పిటల్ సిబ్బందిని కోరారు.ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షులు పింగిలి వెంకట నరసింహ రెడ్డి,ఉపాధ్యక్షులు పోలపల్లి బుచ్చిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాయపురం సాంబయ్య ,సమ్మెట మహేందర్ గౌడ్ ,కార్యదర్శి కట్కూరి స్వామి,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలపల్లి శివ శంకర్ రెడ్డి ,సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు సమ్మెట మహేందర్ గౌడ్, మహ్మద్ రఫీ,మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్కూరి సునీల్, అన్ని గ్రామాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు,ఉపసర్పంచులు,సింధు హాస్పిటల్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ మధు నారాయణ,డాక్టర్ హనిష,మార్కెటింగ్ డైరెక్టర్లు విద్యాప్రకాశ్,విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ పేదవాడి చెంతకు సంక్షేమ పథకాలు





- స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు మరింత భరోసా
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు
- వర్ధన్నపేటలో సంక్షేమ సంబరాలు.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 3, తరంగాలు:** ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేదవాడి చెంతకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని,స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు మరింత భరోసా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు.వర్ధన్నపేటలోని ఎంఎంఆర్ గార్డెన్స్‌లో తహసిల్దార్ విజయసాగర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామానికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని తెలిపారు.రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, స్మార్ట్ రేషన్ కార్డులు, సన్నబియ్యం వంటి పథకాల ద్వారా పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమ పథకాలను మరింత పారదర్శకంగా, సులభంగా ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి న్యాయం చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.అనంతరం వర్ధన్నపేట సెంటర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టపాకాసులు కాల్చి, ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి-రాజేందర్, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య,వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి ప్రియాంక అనిల్, సొసైటీ చైర్మన్ కౌడగాని రాజేష్ ఖన్నా, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న గౌడ్ , పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, డైరెక్టర్లు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# కృష్ణమయమైన ములుగు





- ములుగులో కన్నుల పండువగా బాలగోకులం
- కృష్ణుడు, గోపికల వేషధారణలో 1,500 మంది విద్యార్థుల సందడి..
- 26 ఏళ్లుగా కొనసాగుతున్న సాంస్కృతిక వేడుక
- ములుగు చౌరస్తాలో అలరించిన శోభాయాత్ర

**ములుగు ప్రతినిధి , సెప్టెంబర్ 3,తరంగాలు** : శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో ధర్మ జాగరణ సమితి కన్వీనర్ గంద్ర కోట కుమార్



ఆధ్వర్యంలో బాలగోకులం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి 15 పాఠశాలలు సాధన స్కూల్, బ్రాహ్మణి స్కూల్ , సన్రైజర్స్ స్కూల్, వెంకటాపూర్ జోహార్ స్కూల్, అరవింద స్కూల్,




బిట్స్ స్కూల్,, సెయింట్ ఆంథోనీస్ స్కూల్ , బ్రిలియంట్ గ్రామర్ స్కూల్, మిరాకిల్ స్కూల్ ,వివేకవర్ధిని స్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ , బండారుపల్లి మోడల్ స్కూల్ , జెడ్పీహెచ్ఎస్ బండారుపల్లి స్కూల్, భవాని స్కూల్ నుండి 1500 మంది విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో పాల్గొని శోభాయాత్రలో అలరించారు.

**ఈ సందర్భంగా ములుగు డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ**

"బాలల్లో ఇలాంటి సాంస్కృతిక స్ఫూర్తిని నింపడం చాలా గొప్ప విషయం. శ్రీకృష్ణుడు ధర్మానికి, న్యాయానికి, స్నేహానికి ప్రతీక. చిన్ననాటి నుండే పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల విలువలు తెలియజేయడం వల్ల భవిష్యత్తులో వారు మంచి పౌరులుగా ఎదుగుతారు. 26 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ధర్మ జాగరణ సమితికి నా అభినందనలు. విద్యార్థులు క్రమశిక్షణతో, ఉత్సాహంగా పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

### మున్సిపల్ కమిషనర్ జే సంపత్ మాట్లాడుతూ

"ములుగు పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున బాలగోకులం జరగడం ఆనందంగా ఉంది. పట్టణం మొత్తం బృందావనంలా మారింది. పిల్లలు వేసిన ప్రతి వేషంలో భక్తి, సంప్రదాయం కనిపించింది. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దేశభక్తిని, ధర్మం పట్ల అవగాహనను పెంచుతాయి. ఈ వేడుకకు సహకరించిన ప్రతి పాఠశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు ధన్యవాదాలు. లహరి గ్రూప్ వారు విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం అభినందనీయం" అని అన్నారు.ఈ సందర్భంగా మధు ఫోటో స్టూడియో వారు ఉచిత ఫోటోగ్రఫీని అందించారు.

### విశిష్ట అతిథి ఆర్ఎస్ఎస్ ప్రచారక్ విగ్నేష్ జీ మాట్లాడుతూ

"ధర్మ జాగరణ అంటే కేవలం ఒక కార్యక్రమం కాదు, అది మన



సంస్కృతిని మేల్కొలపడం. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా ఇచ్చిన



సందేశం నేటికీ ప్రతి భారతీయునికి దిక్సూచి. బాల్యంలోనే పిల్లలకు గీతలోని ధర్మ సూక్ష్మాన్ని పరిచయం చేయాలి. 26 ఏళ్లుగా ఆగకుండా ఈ బాలగోకులాన్ని నిర్వహించడం ములుగు గడ్డ గొప్పతనం. ఇది ములుగు సంస్కృతికి నిదర్శనం. పిల్లలే మన దేశానికి భవిష్యత్తు, వారిలోనే కృష్ణుడిని చూడాలి" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్స్పెక్టర్



తాళ్ల ఉదయ్ కుమార్, రామగిరి శ్రీనివాస్, ముక్కు సుబ్బారెడ్డి, కొర్ర సుమలత,మేడుదుల మమన్, కుసుమ రాజు,నూనె బిక్షపతి, సముద్రాల వినయ్, చిమట కృష్ణ, కొత్తపల్లి బాబురావు,యాద సంపత్, రాయించూ నాగరాజు, పాఠశాలల కరస్పాండెంట్లు ముద్దం సంతోష్, తుమ్మ పిచ్చిరెడ్డి,ఎండీ . ముజీఫ్, దుగ్గిరెడ్డి సురేందర్ రెడ్డి,, పెట్టెం రాజు, అక్కల సతీష్, కర్ర రాజేందర్ రెడ్డి, ఏరువ కవిత, కందాల రమేష్ , గిరగాని కవిత, భాగవతల నరసింహమూర్తి, ప్రసన్న కుమార్, శ్రీనివాస రావు,తడక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 200 కోట్ల మార్క్ దాటిన 'ఆవారాపన్-2'




ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.

## దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్ సీక్వెల్




మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్, డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'లక్కీ భాస్కర్' . ఓ సాధారణ బ్యాంక్ ఉద్యోగి మనీ లాండరింగ్, హవాలా ద్వారా ఎలా కోటీశ్వ రుడిగా మారారు? తనను స్కామ్‌లో ఇరికించాలనుకున్న వారినే ఎలా ఇరికించి దేశం దాటేశారు? అనేదే ప్రధానాంశంగా సినిమా రూపొందించారు. ఈ మూవీ క్లైమాక్స్‌లోనే సీక్వెల్ ఉంటుందనే హింట్ ఇచ్చారు. త్వరలోనే లక్కీ భాస్కర్ సీక్వెల్ ఉంటుందని క్లారిటీ ఇచ్చారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. 'చాలా మంది లక్కీభాస్కర్ 2 ఎప్పుడు అని అడుగుతున్నారు. సీక్వెల్ మరింత పవర్ ఫుల్ స్టోరీతో రాబోతోంది.' అని చెప్పారు. దుల్కర్ సల్మాన్ సైతం లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం తాను కూడా వెయిట్ చేస్తున్నట్లు చెప్పారు. అంతకు ముందు తాను ఏ మూవీ ఈవెంట్స్‌కు వటటల్లినా లక్కీ భాస్కర్ సీక్వెల్ కోసం వెళ్లానని... ప్రతీ ఒక్కరికీ ఆ స్టోరీ బాగా కనెక్ట్ అయ్యిందని తెలిపారు. ఫస్ట్ పార్ట్‌లో 100 కోట్ల స్కామ్‌కు పాల్పడిన వ్యక్తిగా హర్షద్ మెహతా రోల్‌ను ఇంట్రడ్యూస్ చేశారు. ఫేక్ బీఆర్స్‌తో బ్యాంక్ నగదును స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేసి భారీ కుంభకోణానికి పాల్పడిన తీరును చూపించారు. అయితే, ఆయన ఎవరు అనేది రివీల్ చేయలేదు. సీక్వెల్‌లో హర్షద్ మెహతా బ్యాగ్రౌండ్‌తో పాటు సీబీఐ ఎంక్వైరీ, భారీ స్కామ్ నుంచి తప్పించుకున్న లక్కీ భాస్కర్ మళ్లీ ఇండియాకి తిరిగివచ్చాడా? ఆ తర్వాత ఏం జరిగింది? అనేదే చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఫస్ట్ పార్ట్ క్లైమాక్స్‌లో సూపర్ హింట్ ఇస్తూనే సీక్వెల్ స్టోరీపైనా క్లారిటీ ఇచ్చారు. ఫస్ట్ పార్ట్‌లో దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించారు. సాయి కుమార్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్ అందించారు. సీక్వెల్‌లో మరిన్ని రోల్స్ యాడ్ కానున్నట్లు సమాచారం.

# పంటల డిజిటల్ సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు





- క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 3, తరంగాలు:పంటల డిజిటల్ సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.జిల్లాలో పంటల వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు చేపట్టిన పంటల డిజిటల్ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంగెం మండలం రామచంద్రాపురం, దుగ్గొండి మండలం నాచినపల్లి, గిర్నిబావి గ్రామాల్లోని పంట పొలాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ కొనసాగుతున్న డిజిటల్ సర్వే తీరును పరిశీలించారు. పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితమైన సమాచారాన్ని డిజిటల్ సర్వేలో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతులు సాగు చేస్తున్న పంటలు, వాటి విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ సర్వే ద్వారా వ్యవసాయ రంగానికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని, భవిష్యత్‌లో రైతులకు ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డీబీసీడీఓ పుష్పలతతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలి






- కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం
- మణికంఠ సర్వీస్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

**వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 3 (తరంగాలు):**నూతనంగా ప్రారంభమైన మణికంఠ సర్వీస్ ఫిల్లింగ్ స్టేషన్ సంస్థ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆకాంక్షించారు.వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డి.సి. తండాలో తుమ్మల యాకయ్యకు చెందిన మణికంఠ సర్వీస్ ఫిల్లింగ్ స్టేషన్ (హిందూస్తాన్ పెట్రోలియం) ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫిల్లింగ్ స్టేషన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరిమిల సంపత్ రావు, జూలూరి శ్రీనివాస్, గుమ్మడి హరిబాబు, బక్కతట్ల రాజు, నందిపాక భాస్కర్, రాజుతో పాటు వర్ధన్నపేట పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల భవిష్యత్తుకు పటిష్ట పునాది వేయాలి





- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- నాణ్యమైన విద్యాబోధన, భోజనం పై కలెక్టర్ దిశానిర్దేశం
- మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి
- వంటగది, సరుకుల నిల్వలను పరిశీలించిన కలెక్టర్
- విద్యార్థినులను ప్రశ్నించి అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించిన కలెక్టర్
- విద్యాబోధన, వసతులు, భోజన నాణ్యతపై క్షేత్రస్థాయిలో పరిశీలన

**వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 3, తరంగాలు:**విద్యార్థినుల భవిష్యత్తుకు పటిష్ట పునాది వేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఉపాధ్యాయులను ఆదేశించారు.నర్సంపేట మండలం మూడు చెక్కలపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ గురువారం సందర్శించారు. సంబంధిత అధికారులతో కలిసి కళాశాలలో పర్యటించిన ఆమె విద్యార్థినులకు అందుతున్న విద్యాబోధన, వసతులు, భోజనం, ఆరోగ్య సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ కళాశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న అంశాలపై విద్యార్థినులను ప్రశ్నించి వారి అభ్యాసన సామర్థ్యాన్ని స్వయంగా తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని చదువులో మెరుగైన ప్రతిభ కనబరిచేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థినుల భవిష్యత్తుకు పటిష్టమైన పునాది పడేలా నాణ్యమైన విద్యను అందించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కళాశాలలోని వంట సామగ్రి నిల్వ గదిని పరిశీలించిన కలెక్టర్ పప్పు దినుసులు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని వార్డెన్‌ను ఆదేశించారు. తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించిన అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు.విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణపై కూడా కలెక్టర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఏఎన్ఎం వద్ద అందుబాటులో ఉన్న మందులను పరిశీలించి, అవసరమైన నాణ్యమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పర్యటనలో డీటీడీవో నారాయణ రెడ్డి, డీబీసీడీవో పుష్పలత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
శుక్రవారం, 04 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్!?




ఆసియా గేమ్స్ 2026 టోర్నీకి టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దూరంగా ఉండనున్నాడు. ఈ విషయాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ టోర్నీలో భారత పురుషుల క్రికెట్ జట్టుకు బీసీసీఐ సీఓఈ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం ప్రకటించింది. జపాన్‌లోని ఐచి-నగోయా వేదికగా జరగనున్న ఆసియా గేమ్స్‌కు భారత బృందాన్ని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. మొత్తం 768 మంది సభ్యులతో కూడిన భారత బృందంలో 503 మంది క్రీడాకారులు, 246 మంది అధికారులు, సహాయక సిబ్బంది, 19 మంది కంటింజెంట్ సిబ్బంది ఉన్నారు. ఆసియా గేమ్స్ నుంచి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు విశ్రాంతి ఇచ్చారు. అప్‌కమింగ్ సిరీస్‌ల కోసం గంభీర్‌కు రెస్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో భారత్ వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. గంభీర్ గైర్హాజరీలో వీవీఎస్ లక్ష్మణ్ జట్టును పర్యవేక్షించనున్నాడు. గంభీర్ సపోర్ట్ టీమ్ కూడా ఈ ఆసియా గేమ్స్‌కు దూరంగా ఉండనుంది. వీవీఎస్ లక్ష్మణ్‌కు సునీల్ జోషి, హృషీకేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్ సపోర్ట్ స్టాఫ్‌గా వ్యవహరిస్తారు. మహిళల జట్టుకు అమోల్ ముజుందార్ హెడ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లోనూ లక్ష్మణ్ భారత జట్టుకు కోచ్‌గా సేవలందించాడు. ఇంగ్లండ్‌తో వైట్‌బాల్ సిరీస్ అనంతరం గంభీర్‌కు విశ్రాంతి ఇవ్వగా.. లక్ష్మణ్ బాధ్యతలు చేపట్టారు. ఆసియా గేమ్స్‌లో భారత పురుషుల, మహిళల జట్లు డిఫెండింగ్ ఛాంపియన్లుగా బరిలోకి దిగుతున్నాయి. చైనా వేదికగా 2022 హాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో రెండు జట్లు స్వర్ణ పతకాలు సాధించాయి. అప్పుడు పురుషుల జట్టుకు రుతురాజ్ గైక్వాడ్ సారథ్యం వహించగా.. మహిళల జట్టును హర్మన్‌ప్రీత్ కౌర్ నడిపించింది. మరోవైపు ఆసియా గేమ్స్‌లో క్రికెట్ జట్లకు వసతి ఏర్పాట్లపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈవో నవోకి అలెక్స్ మియాజీ కీలక వివరణ ఇచ్చారు.

గదుల కొరత ఉన్నప్పటికీ పాల్గొనే జట్లకు హోటల్ వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 3 వరకు టీ20 క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. జట్లు కోరుకుంటే తమకు నచ్చిన వసతిని స్వయంగా ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉందని మియాజీ చెప్పారు. సరైన డ్రెస్సింగ్ రూమ్స్ లేకపోవడంతో పాటు వాష్ రూల్స్ అధ్వాన్నంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వసతులపై బీసీసీఐ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# రోహిత్ పై పనికిమాలిన పుకార్లు ఆపండి

## బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా




టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ వార్తలకు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఫుల్‌స్టాప్ పెట్టారు. బీసీసీఐ అత్యున్నత స్థాయి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఈ పుకార్లపై స్పందించారు. రోహిత్ శర్మ బాగా ఆడుతున్నాడని, ఇకనైనా ఈ పనికిమాలిన పుకార్లను ఆపేయాలని సూచించారు. ముంబైలోని బీసీసీఐ హెడ్ ఆఫీస్‌లో బుధవారం అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. దేవజిత్ సైకియా అధ్యక్షత జరిగిన ఈ సమావేశానికి హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే, టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, బీసీసీఐ సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ హాజరయ్యారు. టీమిండియా భవిష్యత్తు ప్రణాళికలతో పాటు ఆటగాళ్ల గాయాల బెడద, రోహిత్ శర్మ భవితవ్యంపై చర్చించారు. ఈ సమావేశానికి చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ దూరంగా ఉన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో భాగంగా యశస్వి జైస్వాల్‌కు మరిన్ని అవకాశాలు కల్పిం చేందుకు రోహిత్ శర్మను జట్టు నుంచి తప్పిస్తారనే పుకార్లను దేవజిత్ సైకియా ఖండించాడు. 'రోహిత్ శర్మ అన్ని మ్యాచ్‌ల్లోనూ చాలా బాగా ఆడుతున్నాడు. లార్డ్స్ వన్డేలోనూ సెంచరీ చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో.. నేను ఈ పనికిమాలిన పుకార్లకు ప్రాధాన్యత ఇవ్వదలుచుకోలేదు.'అని సైకియా స్పష్టం చేశాడు. టీమిండియా ఆటగాళ్ల గాయాల బెడదపై స్పందిస్తూ.. 'రెండు నెలల పాటు ఐపీఎల్‌లో ఆడిన తర్వాత ఇంగ్లండ్‌కు వెళ్లిన 15 మంది సభ్యుల జట్టులో ముగ్గురు-నలుగురు ఆటగాళ్లు గాయపడ్డారు. సేనా (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల పర్యటనలకు ముందు ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి ఇచ్చేలా, ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడేలా వీలుగా క్రికెట్ షెడ్యూల్‌లో తగిన ఏర్పాట్లు చేస్తాం. నేషనల్ సెంటర్ ఫర్ స్పెషలైజ్డ్ ట్రైనింగ్‌లో హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ పదవి ఖాళీగా ఉన్నప్పటికీ, అక్కడి ఫిట్‌నెస్, పునరావస సౌకర్యాలను పర్యవేక్షించడానికి ఇప్పటికే 16 మంది అర్హత గల వ్యక్తుల విధుల్లో ఉన్నారు.'అని దేవజిత్ సైకియా పేర్కొన్నారు.

## మహా మంధాన.. 18వ అంతర్జాతీయ శతకంతో కొత్త చరిత్ర

అత్యధిక పరుగులతో మిథాలీ రికార్డు బ్రేక్
ఆసియా కప్‌లో సెమీస్‌కు భారత్
హాంకాంగ్‌పై భారీ విజయం

దుబాయ్ : మహిళా క్రికెట్‌లో తనకెవరూ సాటిలేరని భారత స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన (64 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్స్‌లతో 124) నిరూపించింది. ఆసియా కప్ టీ20 టోర్నీలో అద్భుత శతకంతో భారత్‌ను సెమీఫైనల్ చేర్చుతూ రికార్డుల దుమ్ముదులిపింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధికంగా 18వ సెంచరీతో పాటు అన్ని ఫార్మాట్లలో ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్‌గానూ చరిత్రకెక్కింది. ఈ బ్యాట్ బ్యూటీ మెరుపులతో గురువారం జరిగిన గ్రూప్-ఏ మ్యాచ్‌లో భారత్ 137 పరుగుల భారీ తేడాతో హాంకాంగ్‌ను చిత్తుగా ఓడించింది. దాయాది పాకిస్థాన్‌తో పోరుకు ముందే సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. ఈ ఏకపక్ష పోరులో మొదట మంధాన రికార్డు శతకంతో భారత్ 20 ఓవర్లకు 193/5 పరుగుల భారీ స్కోరు చేసింది. లక్ష్య ఛేదనలో హాంకాంగ్.. 16.2 ఓవర్లలో 56 రన్స్‌కే పరిమితమైంది. కెప్టెన్ నటాషా (15) టాప్ స్కోరర్. స్మృతికే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' లభించింది. ఈ టోర్నీ గ్రూప్ దశలో భాగంగా భారత్.. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది.

### స్మృతి సూపర్ షో..



భారత ఇన్నింగ్స్‌లో స్మృతి ఆటే హైలైట్. బౌండరీతో బాదుడుకు శ్రీకారం చుట్టిన ఆమె.. మరో ఓపెనర్ షెఫాలీ (17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28)తో కలిసి ఆరంభం నుంచే ప్రత్యర్థి బౌలర్లపై దండయాత్రకు దిగింది. మర్యమ్ ఓవర్లో ఎక్స్‌ట్రా కవర్స్ దిశగా చూడచక్కని డ్రైవ్‌తో బౌండరీ కొట్టిన ఆమె.. అదే ఓవర్లో మరో రెండుసార్లు బంతిని బౌండరీ లైన్ దాటించింది. ఆ తర్వాత బాదుడు షెఫాలీ వంతు. మరీనా వేసిన ఐదో ఓవర్లో ఆమె.. 4, 6, 4, 6తో రెచ్చిపోయింది. ధాటిగా ఆడే క్రమంలో షెఫాలీని.. 8వ ఓవర్లో రుచిత ఔట్ చేయడంతో 48 బంతుల్లోనే 78 రన్స్ జతచేసిన తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇక్రా సహర్ విసిరిన 11వ ఓవర్లో సిక్స్‌తో 40 బంతుల్లో అర్ధ శతకం సాధించిన ఆమె, ప్రతీక రావల్ (10) నిష్క్రమణ తర్వాత మరింత చెలరేగి ఆడింది. పసలేని హాంకాంగ్ బౌలర్లను ఉతికారేస్తూ బౌండరీలు, సిక్సర్ల మోత మోగించింది. ఫిఫ్టీ తర్వాత ఆమె విశ్వరూపమే చూపించిదనడంలో అతిశయోక్తేమీ లేదు. మర్యమ్ వేసిన 14వ ఓవర్లో రెండు సిక్స్‌లు దంచిన ఆమె.. జోయ్‌లిన్ బౌలింగ్‌లో 6, 4, 4తో 90ల్లోకి వచ్చింది. 95 పరుగుల వద్ద క్యాచ్ మిస్ అవడంతో లైఫ్ లభించిన ఆమె.. బౌండరీతో సెంచరీని పూర్తిచేసింది. ఫిఫ్టీ నుంచి సెంచరీకి రావడానికి ఆమె 18 బంతులు మాత్రమే తీసుకోవడం గమనార్హం. టీ20ల్లో మంధానకు ఇది రెండో సెంచరీ. ఆ వెంటనే రుచిత 18వ ఓవర్లో హ్యాట్రిక్ సిక్స్‌లు దంచిన భారత వైస్ కెప్టెన్.. ఈ క్రమంలో మిథాలీ రాజ్ అత్యధిక పరుగుల రికార్డునూ అధిగమించింది. చివరి ఓవర్లో రనౌట్ అయినా అప్పటికే భారత్ భారీ స్కోరు అందుకుంది.

## తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం..




ఐసీసీ మహిళల క్రికెట్‌లో మరో ప్రతిష్ఠాత్మక టోర్నీకి తెరలేచింది. తొలిసారిగా 2027లో ప్రతిపాదించిన ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యం ఇవ్వబోతోంది. వాస్తవానికి ఈ మెగా టోర్నీని శ్రీలంకలో నిర్వహించాలని ముందుగా నిర్ణయించారు. అయితే శ్రీలంక క్రికెట్ బోర్డులో నెలకొన్న పరిస్థితులు, ఐసీసీ సూచించిన సంస్కరణల అమలులో జాప్యం కారణంగా ఈ టోర్నీని అక్కడి నుంచి భారత్‌కు తరలించారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ప్రత్యామ్నాయ వేదిక కోసం భారత్‌తో పాటు బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికాలను పరిశీలించిన ఐసీసీ బోర్డు.. సెప్టెంబర్ 1న జరిగిన సమావేశంలో ఇండియాకే ఓటు వేసింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ముంబైలోని క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా, వడోదర ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ నిర్ణయంతో భారత అభిమానులకు స్వదేశంలో మరో మెగా ఈవెంట్ చూసే అవకాశం దక్కింది. రౌండ్ రాబిన్ ఫార్మాట్ ఈ ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ పూర్తిగా టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఆతిథ్య భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లు ఇందులో తలపడతాయి. లీగ్ దశలో ప్రతి జట్టు మిగతా అన్ని జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు నేరుగా అర్హత సాధిస్తాయి. శ్రీలంక ఆతిథ్య హక్కులు కోల్పోయినా, టోర్నీలో ఆడే అవకాశాన్ని మాత్రం దక్కించుకుంది. మహిళల క్రికెట్‌కు ఎంతో ప్రోత్సాహం ఈ టోర్నీ మహిళల క్రికెట్‌లో ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని ఐసీసీ చైర్మన్ జై షా హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు పోటీ పడే ఈ ఈవెంట్, గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో పైకి ఎదిగేందుకు జట్లకు అద్భుతమైన స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. ప్రతి ఏడాదీ ఒక మెగా ఐసీసీ టోర్నీ నిర్వహించడం వల్ల మహిళల ఆటకు ఆదరణ మరింత పెరుగుతుందని జై షా ఆశాభావం వ్యక్తం చేశారు.టైటిల్ ఫేవరెట్‌గా టీమిండియా ప్రస్తుతం భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్ ఛాంపియన్‌గా సత్తా చాటుతోంది. గత ఏడాది నవీ ముంబైలో జరిగిన ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి టీమిండియా ఈ టైటిల్ గెలుచుకుంది. మరోవైపు ఆస్ట్రేలియా ప్రస్తుత టీ20 వరల్డ్ కప్ ఛాంపియన్‌గా ఉంది. ఈ ఏడాది లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఆసీస్ ఏడోసారి కప్పు సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ దిగ్గజ జట్ల మధ్య ట్రోఫీ కోసం తీవ్ర పోటీ నెలకొననుంది.

## మాస్ స్టెప్పులతో అదరగొట్టిన శ్రీముఖి



సోషల్ మీడియాను ప్రస్తుతం ఓ ఊపు ఊపేస్తున్న తెలంగాణ జానపదం 'యేషనాగుల కట్ట మీద'. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో ఈ పాటను కొత్తగా రీమిక్స్ చేయడంతో దీనికి విపరీతమైన క్రేజ్ వచ్చింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతీ ఒక్కరూ ఈ పాట బీట్‌కు స్టెప్పులేస్తూ రీల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రెండింగ్‌లో స్టార్ యాంకర్ శ్రీముఖి కూడా చేరిపోయారు. తనదైన స్టైల్లో మాస్ స్టెప్పులేసి సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. జిమ్‌లో వర్కవుట్ల మధ్య 'యేషనాగుల కట్టమీద' పాటకు శ్రీముఖి ఎంతో ఎనర్జీతో డ్యాన్స్ చేశారు. వైట్ టీషర్ట్, బ్లూ మినీ షార్ట్స్‌లో కనిపించిన ఆమె, పాటలోని మాస్ బీట్‌కు తగ్గట్టుగా అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకున్నారు. 'సెప్టెంబర్ ఎనర్జీ' అనే క్యాప్షన్‌తో ఈ డ్యాన్స్ వీడియోను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే ఈ వీడియో వైరల్‌గా మారింది. శ్రీముఖి డ్యాన్స్ చూసిన నెటిజన్లు ఆమె ఎనర్జీకి ఫిదా అవుతున్నారు. 'బుల్లితెర రాములమ్మ అదరగొట్టేసింది', 'మాస్ స్టెప్పులతో ఇరగదీశారు', 'మీ ఎనర్జీ లెవల్స్ వేరే లెవల్' అంటూ కామెంట్ల రూపంలో ప్రశంసలు కురిపిస్తున్నారు. పాటలోని ఊపుకు శ్రీముఖి పెర్ఫార్మెన్స్ సరిగ్గా సరిపోయిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. కొన్నేళ్ల నాటి ఈ జానపద గీతాన్ని 'ది ప్యారడైజ్' చిత్ర బృందం అద్భుతంగా తెరకెక్కించింది. తెలంగాణ జానపద సాహిత్యంలోని కమ్మదనం, దుమ్మురేపే మాస్ బీట్‌కు నాని, కీర్తి సురేశ్ ఎనర్జిటిక్ స్టెప్పులు తోడవడంతో యూట్యూబ్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పాట ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ప్రస్తుతం శ్రీముఖి బుల్లితెరపై టాప్ యాంకర్‌గా బిజీగా ఉన్నారు. 'ఆదివారం విత్ స్టార్ మా పరివారం', 'బిగ్ బాస్ అగ్ని పరీక్ష' వంటి విజయవంతమైన షోలకు హోస్ట్‌గా వ్యవహరించారు. టీవీ కార్యక్రమాలతో పాటు సినిమా ఈవెంట్లు, అప్పుడప్పుడు సినిమాల్లో నటిస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు.

# టాక్సిక్ ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్..





రాకింగ్ స్టార్ యష్ నటించిన టాక్సిక్ చిత్రం మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద జర్నీని కొనసాగిస్తున్నది. ఈ చిత్రం కన్నడ, హిందీ భాషల్లో భారీ వసూళ్లను సాధిస్తున్నది. అయితే గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను తొలుత కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ చేశారు. అయితే ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేయకుండా నిర్ణయం తీసుకొన్నారు. అయితే దాదాపు రెండో వారంలో ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను రిలీజ్ చేసేందుకు సిద్దమయ్యారు. భారతీయ సినిమా రంగంలో అగ్రతారలు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి, రుక్మిణి వసంత్ నటించిన ఈ సినిమాను దక్షిణాదిలో అగ్ర సినీ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్ బ్యానర్‌పై వెంకట్ నారాయణ కే నిర్మించారు. ఈ సినిమాను ఆగస్టు 26వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేశారు. అయితే సాంకేతిక కారణాల వల్ల ఇంగ్లీష్ వెర్షన్ రిలీజ్‌ను వాయిదా వేశారు. టాక్సిక్ విషయానికి వస్తే.. ఈ సినిమాను ఒరిజినల్‌గా కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో షూట్ చేశారు. దానిని తమిళం, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లోకి డబ్ చేసి విడుదల చేశారు. అయితే ఇంగ్లీష్ భాషలో రూపొందించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో రిలీజ్ వాయిదా పడిందని చిత్ర యూనిట్ వెల్లడించింది.

అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌ను సెప్టెంబర్ 4వ తేదీన రిలీజ్ చేస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. పరిమితమైన లోకేషన్లు అంటే.. ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, కొచ్చి, తిరువనంతపురం, ఇతర ప్రాంతాల్లో రిలీజ్ చేస్తున్నారు. అయితే ఈ సినిమా ఇంగ్లీష్ వెర్షన్‌కు రీ సెన్సార్ చేసినట్టు తెలిసింది. వాస్తవానికి ఈ సినిమా ఇండియన్ లాంగ్వేజ్ రన్ టైమ్ విషయానికి వస్తే.. ఈ చిత్రం నిడివి 3 గంటల 14 నిమిషాలు. అంటే.. 194 నిమిషాల రన్ టైమ్‌తో రిలీజ్ చేశారు. కానీ ఇంగ్లీష్ వెర్షన్ విషయానికి వస్తే.. భారీగా కోత పెట్టారు. ఇంగ్లీష్ వెర్షన్‌లో 17 నిమిషాల సన్నివేశాలను తొలగించారు. అంటే ఫైనల్ కట్ 2 గంటల 57 నిమిషాలు అంటే.. 177 నిమిషాల రన్ టైమ్‌తో విడుదల చేస్తున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది. ఇదిలా ఉండగా,భారతీయ భాషల్లో రిలీజైన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 300 కోట్లకుపైగా వసూళ్లను సాధించింది. ఇండియాలో 280 కోట్లకుపైగా గ్రాస్, 235 కోట్ల రూపాయల నెట్ వసూళ్లను సాధించింది. ఓవర్సీస్‌లో 42 కోట్ల రూపాయలు వసూలు చేసింది అని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే.. ఇంకా భారీగా వందల కోట్లు రాబట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## 200 కోట్ల మార్క్ దాటిన 'ఆవారాపన్-2'




ఇమ్రాన్ హష్మి, దిశా పటానీ జంటగా దర్శకుడు నితిన్ కక్కర్ తెరకెక్కించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ఆవారాపన్ -2' బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణతో ఏకంగా రూ. 200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న దిశా పటానీ తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ప్రేక్షకులందరూ ఎప్పటికీ గుర్తుంచుకునే ఒక అద్భుతమైన కథను చెప్పే ఈ ప్రయాణంలో, ఇంత మంచి మనసున్న వ్యక్తులతో కలిసి పనిచేయడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక బృందంలో భాగం కావడం ఒక గౌరవంగా భావిస్తున్నానని, 'ఆవారాపన్-2' చిత్రంపై ప్రేక్షకులు కురిపిస్తున్న అపారమైన ప్రేమకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినై ఉంటానని తెలిపారు. ఈ స్థాయిలో ప్రేక్షకుల ఆదరణ లభించడం తన అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. 2007లో మోహిత్ సూరి దర్శకత్వంలో ఇమ్రాన్ హష్మి, శ్రియా శరణ్ జంటగా వచ్చిన 'ఆవారాపన్' చిత్రం రూ. 18 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి కేవలం రూ. 12 కోట్లు మాత్రమే రాబట్టి ఆ సమయంలో బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. అయితే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత వచ్చిన దీని సీక్వెల్ 'ఆవారాపన్-2' మాత్రం రూ. 200 కోట్ల మార్కును దాటి ఘన విజయం సాధించింది.

# నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణ కేంద్రాలకు హాజరు కావాలి

### ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమావేశం

హనుమకొండ ప్రతినిధి , సెప్టెంబర్ 3, తరంగాలు:

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉండి నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీ, సమయంలో సంబంధిత విచారణ కేంద్రాలకు హాజరై ఎన్నికల సంఘం సూచించిన ధ్రువపత్రాలను సమర్పించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి సూచించారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అదనపు కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా అనామలీస్ (లోపాలు/అసమానతలు), నో మ్యాపింగ్ కేటగిరీలకు



సంబంధించి నోటీసులు అందుకున్న ఓటర్ల విచారణ కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల వివరాలను వెల్లడించారు.

నోటీసులు అందుకున్న ఓటర్లకు విచారణ ఏ విధంగా నిర్వహిస్తారు, ఏఈఆర్ఓలకు ఏయే ధ్రువపత్రాలు సమర్పించాలి, విచారణ సమయంలో పాటించాల్సిన నిబంధనలు ఏమిటి తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు నోటీసులో పేర్కొన్న ప్రదేశంలో, నిర్దేశిత తేదీ, సమయంలో సంబంధిత విచారణ కేంద్రానికి హాజరై ఏఈఆర్ఓకు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు.

నిర్దేశిత తేదీన విచారణకు హాజరుకాని వారికి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తదుపరి నోటీసు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మొదటి దశలో జారీ చేసిన నోటీసులపై విచారణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న విచారణలు, నోటీసుల జారీ, ధ్రువపత్రాల సమర్పణ తదితర అంశాలపై అధికారులు ఇచ్చిన వివరణ పట్ల సమావేశానికి హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఈఆర్ఓ/హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అమరేందర్ రెడ్డి, ఎం.డి. నేహాల్, శ్యామ్ సుందర్, ప్రవీణ్ కుమార్, రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ**



హన్మకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 3,తరంగాలు : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ అనంతరం సంబంధిత ఓటర్ల నుండి విచారణ కేంద్రాల ద్వారా స్వీకరిస్తున్న ధ్రువపత్రాల విచారణ ప్రక్రియను వేగవంతం ఈఆర్వోలు, ఏఈఆర్వోలు చేయాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి /కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పరిధిలోని పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలలో ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలోని ఓటర్లకు నోటీసుల జారీ, విచారణ కేంద్రాల ద్వారా చేపట్టిన స్వీకరణ, డీఈవో/కలెక్టర్ లాగిన్ కి పంపే అంశంపై ఈఆర్వోలు/ఆర్డీవోలు, ఏఈఆర్వోలు/తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై విచారణ కేంద్రాల ద్వారా స్వీకరించిన ధ్రువపత్రాల పరిశీలన విచారణ త్వరగా పూర్తి చేసిన అనంతరం ఏఈఆర్వోలు జిల్లా ఎన్నికల అధికారి లాగిన్ కు పంపాలని అన్నారు. సరైన ధ్రువ పత్రాలు స్వీకరించి విచారణ చేసి లాగిన్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన విచారణ కేంద్రాలలో.. విచారణలో ఏఈఆర్వోలు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. ఓటర్ల నమోదు కోసం ఈ నెల 5, 6, 12,13 తేదీల్లో నిర్వహించే స్పెషల్ క్యాంపెన్ గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని, ఆ తేదీలలో బీఎల్ వోలు పోలింగ్ కేంద్రాలలో అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించాలని దీనిపై ఈ ఆర్వోలు, ఏ ఈ ఆర్వోలు, బీఎల్ వో సూపర్వైజర్లు ప్రత్యేకంగా పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటి వరకు స్వీకరించిన కొత్త ఓటర్ల నమోదు, సవరణ, అభ్యంతరాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డి ఎస్ వెంకన్న, కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

## ఒక్కరోజు ఉపాధ్యాయురాలిగా కలెక్టర్ సత్య శారద

- **విద్యార్థినులతో మమేకమైన కలెక్టర్**
- **కలెక్టర్ చేతిలో చాక్‌పీస్.. తరగతి గదిలో సందడి!**
- **లోహిత పాఠశాలలో విద్యార్థినులకు స్వయంగా పాఠాలు చెప్పిన సత్య శారద**



వరంగల్ ప్రతినిధి , సెప్టెంబర్ 3, తరంగాలు: వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక్కరోజు ఉపాధ్యాయురాలిగా మారారు. దింతో తరగతి గదిలో సందడి నెలకొంది.

విద్యార్థుల అభ్యాస స్థాయిని తెలుసుకోవడంతో పాటు వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం సంగెం మండలం లోహిత గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమైన కలెక్టర్.. ఒక్కరోజు ఉపాధ్యాయురాలిగా మారి స్వయంగా తరగతి గదిలో పాఠాలు బోధించారు.



తరగతి గదిలో విద్యార్థినులతో కలిసి కూర్చున్న కలెక్టర్ వారి చదువు తీరును పరిశీలించారు. పలు అంశాలను సులభమైన రీతిలో వివరిస్తూ విద్యాబోధన చేశారు. విద్యార్థినులను ప్రశ్నలు అడిగి వారి అభ్యాస సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. పిల్లలు చెప్పిన సమాధానాలను ఆసక్తిగా వింటూ, సరైన సమాధానాలు చెప్పిన వారిని అభినందించి మరింత ఉత్సాహపరిచారు.

చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, మంచి అలవాట్లు ఎంతో అవసరమని కలెక్టర్ విద్యార్థినులకు సూచించారు. ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని తెలిపారు. విద్యే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు బలమైన పునాది అని పేర్కొంటూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే దిశగా కష్టపడి చదవాలని సూచించారు.పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం అత్యంత ముఖ్యమని కలెక్టర్ అన్నారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించడంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.కలెక్టర్ స్వయంగా తరగతి గదిలో విద్యార్థినులతో కలిసి కూర్చొని పాఠాలు బోధించడంతో పాఠశాలలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. విద్యార్థినులు కలెక్టర్‌తో ఆత్మీయంగా మాట్లాడి, ఆమె బోధనను ఆసక్తిగా విన్నారు. కలెక్టర్ ఒక్కరోజు ఉపాధ్యాయురాలిగా మారడం విద్యార్థినుల్లో చదువుపై మరింత ఆసక్తి, ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో డీబీసీడీఓ పుష్పలత, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం,అభివృద్ధికి సమ ప్రాధాన్యం

**కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై సంబరాలు**





వర్ధన్నపేట ప్రతినిధి, సెప్టెంబర్ 3,తరంగాలు : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా ఐనవోలు మండల కేంద్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు నేతృత్వంలో కాంగ్రెస్ నేతలు విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు టపాకాసులు కాల్చి, పండ్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు నిర్బంధ వాతావరణంలో గడిపారని ఎమ్మెల్యే విమర్శించారు. స్వేచ్ఛ కావాలనే ఆకాంక్షతోనే ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల పాలనలో పోలీసుల నిర్బంధాలు లేవని, మీడియాపై ఆంక్షలు విధించలేదని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు సచివాలయానికి స్వేచ్ఛగా వెళ్లే అవకాశాన్ని రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. అన్ని రంగాల్లో నియంతృత్వ ధోరణికి ముగింపు పలికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని తీసుకొచ్చామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్,జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు, హనుమకొండ జిల్లా కిసాన్ అధ్యక్షులు పింగిలి వెంకట నరసింహ రెడ్డి,ఉపాధ్యక్షులు పోలపల్లి బుచ్చిరెడ్డి,కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాయపురం సాంబయ్య ,సమ్మెట మహేందర్ గౌడ్ ,కార్యదర్శి కట్కూరి స్వామి,మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పోలపల్లి శివ శంకర్ రెడ్డి ,సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు సమ్మెట మహేందర్ గౌడ్, మహ్మద్ రఫీ,మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్కూరి సునీల్, అన్ని గ్రామాల అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు,ఉపసర్పంచులు,సింధు హాస్పిటల్ క్యాన్సర్ సర్జన్ డాక్టర్ మధు నారాయణ,డాక్టర్ హనిష,మార్కెటింగ్ డైరెక్టర్లు విద్యాప్రకాశ్,విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జనాభా లెక్కలతో పాటు బీసీ కులగణన చేపట్టాలి

**ప్రధాని మోదీకి తహశీల్దార్ ద్వారా బీసీ హక్కుల సాధన సమితి వినతి**




వర్ధన్నపేట ప్రతినిధి , సెప్టెంబర్ 3, తరంగాలు:

దేశంలో సాధారణ జనాభా లెక్కలతో పాటు బీసీ కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీకి వర్ధన్నపేట మండల తహశీల్దార్ విజయ్ సాగర్ ద్వారా మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల శ్రీనివాస్‌తో కలిసి మండల కన్వీనర్ పోషాల మధు మాట్లాడుతూ.. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం మాత్రమే జనాభా లెక్కలతో పాటు బీసీ కులాల వారీగా జనగణన చేపట్టిందన్నారు. స్వాతంత్ర్యానంతరం ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగం నిర్దేశించిందని తెలిపారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 ప్రకారం కమిషన్ ఏర్పాటు చేసి బీసీల జనాభాను లెక్కించి, వారి జనాభా నిష్పత్తి ఆధారంగా అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాల్సి ఉన్నప్పటికీ.. గత 80 ఏళ్లుగా బీసీల కులగణన చేపట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు.2014 ఎన్నికల్లో బీసీ కులాల లెక్కలు తీస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, 2016లో అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైతం పార్లమెంట్‌లో ఈ అంశంపై ప్రకటన చేశారని గుర్తుచేశారు. అయితే 2019లో అగ్రవర్ణ పేదల పేరుతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. ప్రస్తుతం జనాభా లెక్కలతో పాటు బీసీ కులగణన చేపట్టకుండా 'ఎస్సీ, ఎస్టీ అండ్ అదర్స్' పేరుతో సర్వే నిర్వహించేందుకు తీసుకున్న నిర్ణయం బీసీలకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉందని విమర్శించారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సాధారణ జనాభా లెక్కలతో పాటు బీసీల కులాల వారీగా జనాభా లెక్కలు చేపట్టాలని పోషాల మధు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిట్టల భాస్కర్, బొచ్చు యాదగిరి, సంగినేని భీమ్‌రాజు, ఎలిశాల రాజేష్, బొడ్డుపెల్లి సాయిలు, బాషబోయిన ప్రవీణ్ కుమార్, పెద్దూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పల్లవి మోడల్ స్కూల్‌లో వైభవంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

- **సంప్రదాయ వేషధారణలతో అలరించిన చిన్నారులు**
- **భజనలు,నృత్యాలతో ఆకట్టుకున్న విద్యార్థులు**



పర్వతగిరి , సెప్టెంబర్ 3, తరంగాలు:

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు తదితర సంప్రదాయ వేషధారణలతో పాల్గొని ఆకట్టుకున్నారు.విద్యార్థులు ప్రదర్శించిన భజనలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలతో



పాఠశాల ప్రాంగణం ఆధ్యాత్మికత, ఆనందోత్సాహాలతో నిండిపోయింది. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ రాచకొండ అశోక చారి మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పండుగ విశిష్టతను, శ్రీకృష్ణుని జీవితంలోని విలువైన సందేశాలను విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణుని బోధనలు నేటి తరానికి ఆదర్శప్రాయమని, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, నైతిక విలువలను విద్యార్థులు జీవితంలో ఆచరించాలని సూచించారు.

పాఠశాల కరస్పాండెంట్ గంజి మహేందర్ మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించారు. పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను భావితరాలకు పరిచయం చేయడం ఎంతో ముఖ్యమని అన్నారు.డైరెక్టర్ కోటగిరి రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను తెలుసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, కళాత్మక ప్రతిభను పెంపొందించడంతో పాటు సంస్కృతిపై గౌరవాన్ని పెంచుతాయని తెలిపారు.ప్రిన్సిపాల్ మేకల అశ్విని మాట్లాడుతూ కృష్ణాష్టమి పండుగ ప్రత్యేకత, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్లు రాజు, నవ్యశ్రీ, వకులాదేవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సంప్రదాయం, సంస్కృతి, భక్తి, వినోదం మేళవింపుగా సాగిన ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# విద్యార్థులకు పోషకాహారంతో పాటు నాణ్యమైన విద్య అందించాలి







### సాయిపేట పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 4, తరంగాలు:

ధర్మసాగర్ మండలం సాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం ప్రారంభించారు. ముందుగా ఉన్నత పాఠశాలలో, అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఇడ్లీ, సాంబార్‌తో కూడిన అల్పాహారాన్ని కలెక్టర్ స్వయంగా అందించారు.

ఈ సందర్భంగా పాఠశాలలకు హాజరైన విద్యార్థుల సంఖ్యను ప్రధానోపాధ్యాయులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) మెటీరియల్ అందుబాటులో ఉందా, రెమెడియల్ తరగతులు నిర్వహిస్తున్నారా అని ప్రధానోపాధ్యాయుడు బాపురావును అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎల్ఎన్ వర్క్‌బుక్‌ను కలెక్టర్ పరిశీలించారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చట**

అనంతరం పాఠశాలల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. కేంద్రానికి హాజరైన చిన్నారుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్.. వారికి రైమ్స్ వస్తాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చార్టులు, గోడలపై చిత్రించిన పక్షులు, జంతువుల బొమ్మలను చూపిస్తూ వాటి పేర్లు చెప్పాలని కోరగా చిన్నారులు ఉత్సాహంగా సమాధానాలు చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడంపై పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడాలి లక్ష్మి, డీఈవో గిరిరాజు గౌడ్, తహసీల్దార్ బావ్‌సింగ్, ఎంఈఓ శ్రీదేవి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రమాదేవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి ముహూర్తం ఖరారు?



'పెద్ది'తో 400కోట్ల విజయాన్ని అందుకున్న రామ్‌చరణ్ తన నెక్ట్స్ సినిమా కోసం రెడీ అవుతున్నారు. పాన్ ఇండియా డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో ఆయన నటించనున్న విషయం తెలిసిందే. 'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత సుకుమార్ నుంచి రానున్న సినిమా కావడం, 'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడం.. ఈ రెండు కారణాల వల్ల ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్ సంస్థలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాకు చెందిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని దసరా రోజున ఘనంగా నిర్వహించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. అర్బన్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే వైవిధ్యమైన కథతో రూపొందనున్న ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లకు స్థానం ఉన్నది. ప్రస్తుతమైతే రష్మిక మందన్న, జాన్వీకపూర్, అషికా రంగనాథ్‌ల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.